తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-18- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 22 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# టెహ్రాన్‌ను ఖాళీ చేయాలి



- ట్రంప్ పర్యటనకు అర్ధాంతర ముగింపు
- యుద్ధ పరిస్థితులపై సమీక్ష
- ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు హెచ్చరికలు
- అణు బాంబు ఆందోళన
- విపత్తుకు ముంచుకొస్తున్న సంకేతాలు

టెహ్రాన్

జీ7 కూటమి శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడాకు చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షెడ్యూల్ కంటే ఒకరోజు ముందే హఠాత్తుగా స్వదేశానికి వెళ్లిపోయారు. కెనడాలో జరగాల్సిన కీలక భేటీలను రద్దు చేసుకున్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఉధృతంగా మారుతుండడంతో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికే ఆయన కెనడా పర్యటనను అర్థంతరంగా ముగించుకొని అమెరికాకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని ట్రంప్ సూచించారు.

మిగతా 7లో..

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ భీకరరూపం

- ఇరాన్ సైనిక జనరల్ అలీ షాద్మానీ హత్య
- ఇజ్రాయెల్ దాడులు ఉధృతం
- విమానాలు, మిస్సైల్ స్థావరాల ధ్వంసం
- ఇరాన్ ప్రతీకారం
- మొస్సాద్ కార్యాలయం లక్ష్యం, భారీ ప్రాణనష్టం

2లో..



## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

న్యూ ఢిల్లీ,(తెలంగాణ ముచ్చట్లు)

ఇరాన్‌ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు,విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైనది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**సహాయం కోసం ప్రజలు క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు:**

**శ్రీమతి వందన,పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్**
– +91 9871999044
**శ్రీ జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్**
– +91 9643723157
**శ్రీ జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్**
– +91 9910014749
**శ్రీ సిహెచ్. చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి**
– +91 9949351270

# బనకచర్ల పై నేడు సచివాలయంలో సమావేశం

- ముఖ్య అతిధులుగా పాల్గొన నున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రత్యేక అతిధులుగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ లకు అహ్వానం
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ లకు స్వయంగా ఫోన్ లో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అందుబాటులో ఉన్న లోకసభ, రాజ్యసభ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి అహ్వానించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హాజరు కానున్న తెలంగాణా లోకసభ, రాజ్యసభ సభ్యులు
- గోదావరి-బనకచర్ల పై తదుపరి చర్యలకు కార్యాచరణ ప్రణాళికకు సన్నాహాలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

గోదావరిబనకచర్ల ప్రాజెక్టును మరింత గట్టిగా ప్రతిఘటించడంతో పాటు కేంద్ర జలసంఘం అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.అందులో భాగంగ బుధవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర సచివాలయంలో లోకసభ,రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ సమావేశంలో ప్రత్యేక అతిధులుగా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ లను అహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి ,బండి సంజయ్ లకు స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోన్ చేసి సమావేశానికి అహ్వానించారు.అందుబాటులో ఉన్న లోకసభ సభ్యులు,రాజ్యసభ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ మేరకు నేడిక్కడ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి,తాను 2025 జూన్ 3 న కొత్త ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ ను స్వయంగా కలసి

మిగతా 2లో..





# గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించండి

- ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- తొలి దశలో నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్,(తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సీఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని... స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

## ఫార్ములా ఈ కేసులోవ్యక్తిగత ఫోన్లు, ల్యాప్టాప్‌లు ఇవ్వాల్సిన అవసరం లేదు..!

- స్పష్టం చేసిన కేటీఆర్ తరపు న్యాయవాదులు



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

ఫార్ములాఈ కార్యక్రమానికి సంబంధించిన లావాదేవీలు అన్నీ అధికారికంగా ప్రభుత్వ అంగీకారంతో,బ్యాంకు అకౌంట్ల ద్వారా జరిగిన నేపథ్యంలో, విచారణ సంస్థల డిమాండ్‌కు అనుగుణంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత ఫోన్ లేదా ల్యాప్‌టాప్ ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన న్యాయవాదులు స్పష్టం చేశారు.

ఏసీబీ చేసిన డిమాండ్‌కు స్పందించిన కేటీఆర్ న్యాయవాదులు — వ్యక్తిగతంగా వాడే ఫోన్లు,ల్యాప్టాప్‌లు ఎలాంటి కోర్టు ఆదేశం లేకుండా, వాటి ద్వారా విచారణకు సహకారం అవసరం అనే స్పష్టమైన ఆధారాలు లేకుండా, విచారణ సంస్థలు అభ్యర్థించడానికి హక్కులేదు అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా ఇలాంటి డిమాండ్లు చేయడం సరికాదని వివరించారు.

ఫార్ములా-ఈ నిర్వహణ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జరిగింది. కేటీఆర్ స్వయంగా మంత్రి పదవిలో ఉన్నపుడు తీసుకున్న నిర్ణయమేనని, అందుకు సంబంధించి అన్ని వివరాలు ఇప్పటికే ప్రభుత్వ అధికారిక డాక్యుమెంట్లలో ఉన్నాయని, వ్యక్తిగత డేటా అడగడం అనవసరమని కేటీఆర్ తరపు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో వ్యక్తిగత సమాచారం కోరడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, ఇది ఒక కుట్రలో భాగమని కూడా న్యాయవాదులు ఆరోపించారు. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించే ప్రయత్నాలను తాము త్రోవతప్పిన చర్యగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.

**ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడికి లీగల్ నోటీసులు జారీ చేసిన కేటీఆర్**

2లో..

## భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

**ఆయా జిల్లా కలెక్టర్‌లకు మంత్రి పొంగులేటి దిశానిర్ధేశం**

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:



తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని భూ భారతి చట్టం ద్వారా ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ

మిగతా 2లో..

## ప్రజా ఉద్యమం తప్పదు.. జులై 17 న రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకో..

- రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి.
- తెలంగాణ జాగృతి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత.



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ప్రజా ఉద్యమం చేస్తామని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.

మిగతా 2లో..



## ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

- టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు
- రెస్టారెంట్ ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

హైదరాబాద్,(తెలంగాణ ముచ్చట్లు)

టూరిజం ప్లాజా హోటల్స్ లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ.. ఆహార పదార్థాలను, కిచెన్ ను పరిశీలించారు.. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిధులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. హరిత హోటల్స్ లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిధుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్ ను తీర్చిదిద్దుతామని చెప్పారు.

బుధవారం-18- జూన్ 2025

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# బనకచర్ల పై నేడు సచివాలయంలో సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యంతరాలను లేవ నెత్తిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అందుకు ప్రతిగా స్పందించిన కేంద్రమంత్రి సి.ఆర్ పాటిల్ స్పందిస్తూ 2025 మే 28 న తనకు రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన డి.పి.ఆర్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకు అందలేదని చెబుతూనే అది అందిన మీదట నీటి కేటాయింపులలో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు,ట్రిబ్యునల్ తీర్పులు,అంతర్ రాష్ట్ర ఒప్పందాలతో పాటు 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాలను పరిగణనలోకి తీసుకున్నకే సమీక్షిస్తామన్నారు.తిరిగి 2025 జూన్ 13 న తిరిగి తాను కేంద్ర జలశక్తి మంత్రికి రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ పథకంపై అభ్యంతరాలను తెలియ పరచడం జరిగిందన్నారు. అంతే గాకుండా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులను కేంద్ర జల సంఘం నిలువరించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన ఉటంకించారు. వీటన్నింటినీ సమీక్షించిన మీదట గోదావరిబనకచర్ల విషయంలో భవిష్యత్ లో అనుసరించాల్సిన వ్యూహం పై బుధవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో లోకసభ, రాజ్యసభ సభ్యులతో సమావేశం ఏర్పటు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

# గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సీఎం తెలిపారు. గోసంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సీఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాస రాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడికి లీగల్ నోటీసులు జారీ చేసిన కేటీఆర్

- **ఫోన్ ట్యాపింగ్ పేరిట పీసీసీ అధ్యక్షుడు చేసిన అసత్య ఆరోపణలపై మండి పడ్డ కేటీఆర్**
- **హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు**
- **తన చేతికానీతాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం**
- **సాక్ష్యాధారాలు లేకుండా తమపై, ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపాటు**
- **వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్**



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

ఫోన్ ట్యాపింగ్ పేరిట అసత్య ఆరోపణలు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ విధమైన ఆధారాలు లేకుండానే తమపై, తమ పార్టీ నేతలపై దిగజారుడు వ్యాఖ్యలు చేసినందుకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేష్ కుమార్ గౌడ్ కు లీగల్ నోటీసులు కూడా పంపించినట్లు తెలిపారు.

హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, తన చేతకానీతాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోందని ఆయన విమర్శించారు. ఇది పూర్తిగా దిక్కుమాలిన, బాధ్యతలేని చర్యగా అభివర్ణించారు. ప్రజలకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వం, అటెన్షన్ డైవర్షన్ కోసం కుట్రలతో కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ విమర్శించారు. తమపై వేసిన కేసులకు చట్టబద్ధంగా హాజరై విచారణకు సహకరిస్తున్నామని, అయితే తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఇకపై మౌనం పాటించవని, పార్టీ పరువు కాపాడేందుకు కోర్టు మార్గాన్ని తప్పనిసరిగా అనుసరిస్తామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలను తప్పుదారి పట్టించాలనే దురుద్దేశంతోనే ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ ఇద్దరూ అబద్ధాలు చెప్పడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, పాలనపై దృష్టి పెట్టకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇలాంటి అటెన్షన్ డ్రామాల వెనుక దాగిన అసలు ఉద్దేశం ప్రజల దృష్టిని మళ్లించడమేనని, కానీ అది సాగదేరదని హెచ్చరించారు. ప్రజలకు మేలు చేసే అంశాలపై దృష్టి సారించాలని సూచిస్తూ, ఇలాటి ప్రచార యుద్ధాలకు అంతం చెప్పాలని పిలుపునిచ్చారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ భీకరరూపం

టెహ్రాన్



అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఇరాన్ సముపార్జించకుండా అడ్డుకున్నామని ప్రకటించిన ఇజ్రాయెల్ తన దాడుల తీవ్రతను మరింత పెంచింది. ఇరాన్ అత్యున్నత నేత, సుప్రీం కమాండర్ అయ తొల్లా అలీ ఖమేనీకి సన్నిహితుడు, ఖాటమ్ అల్ -అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ సారథి, సైనిక జనరల్ అలీ షాద్మానీని ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షాద్మానీ ఉంటున్న ఒక రహస్య ప్రదేశంపై క్షిపణుల వర్షం కురిపించి ఆయన ప్రాణాలుతీసింది. భూతలం నుంచి భూతలం మీది లక్ష్యాలను ఛేదించే 120 మిస్సైల్ లాంచర్లను నాశనం చేశామని ఇజ్రాయెల్ తెలిపింది.

ఎఫ్-14 రకం రెండు యుద్ధవిమానాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. 10 కమాండ్ సెంటర్లను నేలకూల్చామని పేర్కొంది. దీంతో ఇరాన్ సైతం తీవ్ర స్థాయిలో బాలిస్టిక్ క్షిపణులతో బదులు చెప్పింది. టెల్ అవీవ్ సిటీలో ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ కార్యాల యంపై మెరుపు దాడులు చేసింది. దీంతో ఆ భవనం ధ్వంసమైనట్లు వార్తలొచ్చాయి. టెల్ అవీవ్‌తోపాటు వెస్ట్ జెరూసలేంలోనూ బాంబుల మోతలు మోగాయి.

ఇజ్రాయెల్‌లోని హెర్జిలియాలో 8 అంతస్తుల భవంతి ధ్వంసమైంది. ఇకపై మరింతగా దాడులు చేస్తామని ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సయ్యద్ అబ్దుల్‌రహీం మౌసావీ ప్రకటించారు. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి, డ్రోన్ దాడుల్లో ఇరాన్‌లో 224 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,277 మంది గాయపడ్డారు. ఇరాన్ జరిపిన మిస్సైళ్ల దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది చనిపోయారు. 500 మందికిపైగా పౌరులు గాయపడ్డారు.

# ప్రజా ఉద్యమం తప్పదు.. జులై 17 న రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకో..

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్ లో కామరెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగబద్ధంగా 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన కామరెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధితో కులగలానా చేస్తే దాని వివరాలను బయటపెట్టాలని సవాలు విసిరారు. బీసీలందరూ ఏకమై ముందుకు నడవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ సాధనకై జూలై 17 న రాష్ట్ర వ్యాప్తంగా రైలు రోకో కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

అడగవలసిన చోట అడగకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తే విద్య, ఉద్యోగం, ఉపాధిలో మెరుగైన అవకాశాలుంటాయి అన్నారు. మహిళలందరూ బిసి బిల్లు కోసం మాట్లాడాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. మెదక్ ఎంపీ గా రఘునందన్ రావు గెలిచిన తర్వాత ఒక్కసారైనా బీసీల గురించి మాట్లాడారని అని ఈ విషయాన్ని ఆయననే ప్రశ్నించాలనీ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. రిజర్వేషన్ కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే బీసీల అందరి కలిసి ఎన్నికలను జరగనివ్వద్దని తెలిపారు. బిసి బిల్లు వస్తే మాకేంటి అని ఆలోచించేవారికి ఏదో విధంగా అవకాశాలు వస్తాయని తెలిపారు. ఊరు రా ఉద్యమం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, అలాగే ఊరు రా తిరిగి ఉద్యమం చేస్తే బిసి బిల్లు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు బీసీ సంఘంల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టెహ్రాన్‌ను ఖాళీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ దాడులు భీకరంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని చెప్పారు. ఆయన స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం కెనడాలో మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 'ఎక్స్'లో పోస్టుచేశారు. సాయంత్రం జీ7 దేశాల అధినేతలతో ఫొటోలు దిగారు. ''నేను వెంటనే వెనక్కి వెళ్లిపోవాలి. చాలా ముఖ్యం'' అని చెప్పారు. ఇంకా ఆలస్యం కాకముందే అణు కార్యక్రమానికి తెరదించాలని ఇరాన్‌కు ట్రంప్ హితవు పలికారు.

దాడులు ఆగాలంటే అణ్వస్త్రాల ఆలోచన మానుకోవాలని, ఇజ్రాయెల్‌తో ఒప్పందానికి రావాలని సూచించారు. ఒప్పందం విషయంలో ఇప్పటికే 60 రోజుల సమయం లభించినా ఇరాన్ పాలకులు సద్వినియోగం చేసుకోలేదని తప్పుపట్టారు. మరో గత్యంతరం లేక ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌పై దాడులకు దిగిందని అభిప్రాయపడ్డారు. యుద్ధం ఆగాలా? లేక కొనసాగాలా? అనేది ఇరాన్ చేతుల్లోనే ఉందని అమెరికా అధ్యక్షుడు పరోక్షంగా తేల్చిచెప్పారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో అమెరికా పాత్ర ఏమిటి?



అని ప్రశ్నించగా.. స్పందించడానికి నిరాకరించారు.

**ఇరాన్‌కు అణుబాంబు దక్కదు**

అణు బాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలోకి వచ్చిందని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయినప్పటికీ ఇరాన్ అణు బాంబును తయారు చేసుకొనే అవకాశం ఎంతమాత్రం లేదని స్పష్టంచేశారు. కెనడా నుంచి స్వదేశానికి వస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయడం లేదంటూ అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ఈ ఏడాది మార్చి నెలలో చేసిన ప్రకటనను ట్రంప్ కొట్టిపారేశారు. ఆమె ఏం చెప్పారో తాను పట్టించుకోనన్నారు.

**ఇజ్రాయెల్ సైన్యానిదీ అదేమాట**

ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా ధ్వంసంచేయాలని, అణు శాస్త్రవేత్తలను, కీలక సైనికాధికారులను అంతమొందించాలని ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మధ్యభాగంలో క్షిపణి దాడులకు సిద్ధమవుతోంది. సెంట్రల్ టెహ్రాన్‌లో ఉంటున్న 3.30 లక్షల మంది బయటకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది.

టెహ్రాన్‌ను పూర్తిగా ఖాళీ చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పిన కాసేపటికే సైన్యం అదే తరహాలో ఆదేశాలివ్వడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వ టీవీ, పోలీసు ప్రధాన కార్యాలయాలతోపాటు ముఖ్యమైన ఆసుపత్రులు సెంట్రల్ టెహ్రాన్‌లోనే ఉన్నాయి. రాజధాని నగరంలో 90 లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. ఇక్కడ వైమానిక దాడులు జరిగితే ప్రాణనష్టం ఊహించని స్థాయిలో సంభవించే అవకాశం ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయా జిల్లా కలెక్టర్లకు సూచించారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే రెండు నెలలు రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమైనవని భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై ఏడాదిన్నర అవుతుందని ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమం అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని సూచించారు.










# బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ప్రకటన

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

గత కొంతకాలంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించిన ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. తాజాగా సంచలన ప్రకటనతో మరొకసారి వార్తల్లోకి వచ్చారు. ఇక ఐక్యంగా కలిసి పని చేద్దామంటూ రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రాజాసింగ్ ఓ స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు.

'పార్టీలో ఐక్యత, పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. కానీ నన్ను టార్గెట్ చేసి అడ్డంకులు సృష్టించాలని చూసినా నిస్వార్థంగా పార్టీ కోసమే పని చేశా. ఒక పార్టీ కార్యకర్తనైన నన్ను ఇబ్బంది పెడితే ఏం లాభం?. కిషన్‌రెడ్డి వ్యక్తిగత సమయం



ఇస్తే వచ్చి కలుస్తాను. సమస్యలు, పార్టీలో మా స్పష్టతను వివరిస్తాను. సమయం నిర్ణయించే చెబితే వచ్చి కలిసేందుకు సిద్ధంగా ఉన్నా. విభజించడానికి కాదు.. ఐక్యత కోసం ఇక్కడ ఉన్నా. వ్యక్తిగత విభేధాలను విడిచిపెట్టి ఐక్యంగా పని చేద్దాం' అని రాజాసింగ్ తన ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

# భూపాలపల్లి అభివృద్ధికి విద్యుత్,మైనింగ్ రంగాల్లో కీలక ముందడుగులు

- రూ.8.70 కోట్లతో నిర్మిత 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల ప్రారంభం
- సింగరేణి భవిష్యత్ ప్రణాళికపై సమీక్ష
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**భూపాలపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా గిరిజనుల ఆశయాలకు అనుగుణంగా విద్యుత్ మరియు మైనింగ్ రంగాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ₹ 8.70 కోట్ల వ్యయంతో నిర్మితమైన 33/11 కిలోవోల్ట్ సామర్థ్యం గల సబ్‌స్టేషన్‌లను ప్రారంభించారు.

ఈ సబ్‌స్టేషన్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన, నిరవధిక విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని భట్టి పేర్కొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, ప్రజలతో నేరుగా సంభాషించి వారి అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకున్నారు. ప్రజల ఆశీస్సులతో మరింత సమర్థవంతంగా పని చేస్తామని తెలిపారు.

తర్వాత భూపాలపల్లి సింగరేణి జీఎం కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ భవిష్యత్ తరాల ఉపాధికి మార్గం చూపించేలా పనిచేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. బొగ్గుతో పాటు ఇతర ముఖ్య ఖనిజాల్లో విస్తరణ అవసరం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థకు 136 ఏళ్ల మైనింగ్ అనుభవం ఉన్న నేపథ్యంలో, ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన దిశలో అడుగులు వేయాలని సూచించారు.

భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాల అంశంపై సమగ్రంగా విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కోసం బోనస్, రూ. కోటి ప్రమాద బీమా అమలుపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికులు ఉత్పత్తి వ్యయం, మార్కెట్ ధరకే పరిమితం కాకుండా సంస్థ ప్రగతిలో భాగస్వాములయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దీల్ల శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణను విద్యుత్ మరియు మైనింగ్ రంగాల్లో దేశంలో ఆదర్శంగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పబద్ధంగా ముందుకెళ్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# 200 కోట్లతో వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

- మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల పరిశీలించిన ఎమ్మెల్యే

**వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**





వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారులో గువ్వల బోడు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు, సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు అనుకూలమైన భూమిని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు పరిశీలించారు. ఎంఆర్ఓ, మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన అధికార భూముల స్థితిని పరిశీలించారు.

ఇటీవల వర్ధన్నపేట నియోజకవర్గానికి ₹ 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైంది. ఈ నేపథ్యంలో గువ్వల బోడులోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల కోసం స్థలాన్ని ఎంపిక చేయడం జరిగింది. దీని కోసం కొంతమంది దళిత, గిరిజన రైతులు అసైన్డ్ భూమిని వదిలి స్కూల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇవ్వడానికి ముందుకు రావడం ముఖ్యంగా గమనించదగినది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గాన్ని గతంలో ఎన్నోమంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించినా, రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా స్థిర సంస్థను ఇక్కడ స్థాపించడంలో ఆసక్తి చూపలేదని విమర్శించారు. అనువైన స్థలం లేదని కారణంగా చూపుతూ విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించారని, దీంతో నియోజకవర్గ అభివృద్ధి పరిమితమైందన్నారు.

ఇకపై అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు గువ్వల బోడులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గువ్వల బోడు ప్రాంతం రవాణా సదుపాయాలతో కూడినదిగా ఉండడం వల్ల విద్యార్థులు ఏ ఇబ్బందీ లేకుండా ప్రయాణించగలరని పేర్కొన్నారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు.ఈ స్కూల్ స్థాపన ద్వారా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# దండోరా జెండా అణగారిన వర్గాలకు అండ

- కొమ్ము చెన్నకేశవులు
- ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**




78 యేండ్ల స్వతంత్ర భారతదేశంలో 30 ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు అన్నారు .ఈ ముప్పై ఏళ్ల కాలంలో దండోరా జెండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుల కొమ్ముచెన్నకేశవులు మాదిగ అన్నారు.మంగళవారం చిన్నమందడి ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు వడ్డేమాన్ మధు అధ్యక్షతనలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పాల్గొని మాట్లాడుతూ..

భారత అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డును పొందిన మందకృష్ణ మాదిగకు ఈనెల 19న హైదరాబాద్ లోని నాగోల్ లో గల శుభం గార్డెన్ లో వికలాంగుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఘన సన్మానం చేయబోతున్నామని వికలాంగుల పెన్షన్ దారులు కదిలి రావాలని వి హెచ్ పి ఎస్ నాయకులు ఏకం చేసి పంపాలని ఎమ్మార్పీఎస్ నాయకులకు పిలుపు ఇవ్వడం జరిగింది దేశంలో అత్యధికంగా వికలాంగుల పెన్షన్ పొందుతున్న రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణలు నిలిచిపోతాయని అన్నారు. దానికి కారణం ఈ రెండు రాష్ట్రాలలో మందా కృష్ణ మాదిగ నడిపిన ఉద్యమ ఫలితమే ఎంతోమంది ముఖ్యమంత్రులు, రాజకీయవేతలు రాష్ట్రాన్ని పరిపాలించినప్పటికీ వికలాంగుల గురించి ఎవరు పట్టించుకోలేదన్నారు మందకృష్ణ మాదిగ వికలాంగులను ఏకం చేసి వీహెచ్పీఎస్ సంఘాన్ని స్థాపించి పెన్షన్లు పెంచాలని పోరాటం చేయడం వల్లనే ఈ నాలుగు వేల రూపాయలు పెన్షన్లు అందుతున్నాయని అన్నారు. అంతేకాదు వికలాంగులకు ఆత్మస్థైరం, ఆత్మగౌరవం పెరిగింది. సమాజంలో గుర్తింపు గౌరవం లభించిందని అన్నారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించిన తరువాత , మంద కృష్ణ తన పేరు పక్కన మాదిగ అని చేర్చుకున్న తరువాత మాదిగ సమాజానికి ఎనలేని ధైర్యం కలిగింది. ఆ ధైర్యంతోనే మాదిగలంతా తమ పేరు పక్కన కులం పేరు చేర్చుకొని ఆత్మ గౌరవాన్ని చాటుకున్నారని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందక పోవడం వల్లనే మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారు.కనుక జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పై ఏళ్ళు రాజీలేని పోరాటం సాగిందని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిందని,దాని ద్వారా మాదిగలకు 9% రిజర్వేషన్లు దక్కాయి.ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలు మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి లోకి రావాలని పిలుపునిచ్చారు.అలాగే ఎస్సీ వర్గీకరణతో పాటు ఆరోగ్యశ్రీ, వికలాంగులు , వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళల పెన్షన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు , మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మొదలగునవి ఎమ్మార్పీఎస్ సాధించి అన్ని వర్గాలకు అండగా నిలిచిందని అన్నారు . కనుక దండోరా జెండా సమస్త అణగారిన వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో జూలై 7 న ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా చేసుకోవాలని అన్నారు.ప్రతి గ్రామంలో దండోరా జెండా ఆవిష్కరణలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో సభలు జరిపి ఉద్యమానికి తోడుగా ఉన్న అన్ని కులాల పెద్దలను సత్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ము సాయిలు మాదిగ, కొమ్ము కృష్ణయ్య మాదిగ, కొమ్ము నరసింహమ్మ మాదిగ, వడ్డెమన్ మాదిగ, వడ్డెమన్ కాశన్న మాదిగ, కొమ్ము బాలకిష్టయ్య మాదిగ, వడ్డెమన్ రాములు మాదిగ పానుగంటి రమేష్ మాదిగ, నాగభూషణ్ మాదిగ, పెంటన్న మాదిగ, చెన్నయ్య మాదిగ మాదిగ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులకు నియంత్రణ అవసరం

- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య సిద్ధు నాయక్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూలును నియంత్రించాలని, విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సేవాలాల్ సేన జిల్లా శాఖ డిమాండ్ చేసింది.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు భూక్య సిద్ధు నాయక్ (సమ్ములాల్) మాట్లాడుతూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని చాలా ప్రైవేట్ పాఠశాలలు తగిన వసతులు లేకుండానే అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. పుస్తకాల పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు.అలాగే, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కనీసం 25 శాతం స్థానాలు ఉచితంగా అందించాలన్న నిబంధనను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి లోని ఆయన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.పార్టీ పట్ల విధేయత,ప్రజా సమస్యల పట్ల చొరవ ఉన్న నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో వనపర్తి మండల ముఖ్య నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ముఖ్య నాయకులతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు వారికి వివరించారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కే.మాణిక్యం ,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్,నాయకులు భానుప్రకాష్ రావు,రవిప్రకాష్ రెడ్డి,మతీన్,రఘువర్ధన్ రెడ్డి,మాధవ్ రెడ్డి,శివన్న,ధర్మా నాయక్,లక్ష్మీకాంత్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి,అడ్వకేట్ అశోక్,చిట్యాల.రాము అన్ని గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు

**కరీంనగర్,తెలంగాణ ముచ్చట్లు:**



కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ శరత్ మరియు సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ ఎసిబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. వెహికల్ బిల్లు చెల్లింపునకు సంబంధించి రూ.8,000 లంచం డిమాండ్ చేసిన ఇద్దరూ, అదే మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఎసిబీ అధికారులు సలసలలాడుతూ పట్టుకున్నారు. అనంతరం నగదును సీజ్ చేసిన అధికారులు శరత్ మరియు వేణుగోపాల్‌లను అరెస్టు చేశారు.ఈ ఘటనపై పూర్తి సమాచారం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.



# మృతుడు రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

**వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మెరుగు రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు మంగళవారం రోజున రాజేష్ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని విధాలుగా మద్దతు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏపీ రాజు, కాంగ్రెస్ నాయకులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్, పోశాల వెంకన్న గౌడ్, మహమ్మద్ చోటే, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భాను ప్రసాద్ సహా పలువురు గ్రామ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# రైతు భరోసా వానాకాలం-2025 రైతుల ఖాతాల్లో జమ...

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రైతు భరోసా వానాకాలం 2025 లో భాగంగా రైతుల ఖాతాల్లో సోమవారం నుండి నేరుగా జమచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 53 వేల 794 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 436 కోట్ల 84 లక్షల 65 వేల 365 రూపాయలు జమచేయనున్నట్లు వ్యవసాయ అధికారి అన్నారు. సోమవారం మొదటి రోజున 2 లక్షల 13 వేల 932 మంది రైతులకు 123 కోట్ల 38 లక్షల 40 వేల 175 రూపాయలు, రెండో రోజు మంగళవారం 3 ఎకరాల వరకు భూమి గల 46 వేల 859 మంది రైతులకు మొత్తం 70 కోట్ల 6 లక్షల 57 వేల 468 రూపాయలను, ఇప్పటివరకు 2 లక్షల 60 వేల 791 మంది రైతులకు 193 కోట్ల 44 లక్షల 97 వేల 643 రూపాయలను రైతు భరోసా వానాకాలం2025 క్రింద రైతుల ఖాతాల్లో జమచేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. 5 జూన్, 2025 నాటికి పట్టాదారు పాస్ పుస్తకం పొందిన, డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) ఫెయిల్ అయిన రైతు సోదరులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, ఖాతా నెంబర్ ను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చర్చనీయాంశంగా వరంగల్ పోలీసుల తీరు

- ఆగ్రహం వ్యక్తం చేసిన సిపి,మెమోలు జారీ
- మాజీ ఎమ్మెల్సీకి వ్యక్తిగత భద్రత ఇవ్వడంపై వివరణ కోరిన పోలీస్ శాఖ




**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ పోలీసుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పర్యటన సందర్భంగా పోలీసులు ఆయనకు ఎస్కార్ట్, పైలట్ డ్యూటీలు నిర్వహించినట్లు వార్తలు వెలుగులోకి రావడంతో, ప్రజల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై మీడియా కథనాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తల నేపథ్యంలో పోలీస్ శాఖ పరువు మసకబారుతోందని పోలీసు ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంపై స్పష్టత కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి సబ్ డివిజన్ స్థాయి పోలీసు అధికారులకు మెమోలు జారీ అయ్యాయి. "విధులను వదిలి కొండా వెంట వెల్లు" అనే శీర్షికతో 14 జూన్ 2025 నామస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ, జూన్ 13న కొండా మురళి పర్యటనలో పోలీస్ బందోబస్తు అవసరం లేనప్పటికీ భారీగా పోలీసు బలగాలను వినియోగించడం ఏ మాత్రం సమంజసం కాదని మెమోలో పేర్కొన్నారు.భద్రతా సమీక్ష కమిటీ ప్రకారం, మాజీ ఎమ్మెల్సీకి ఎలాంటి అధికారిక భద్రత అవసరం లేదని, అలాంటి పరిస్థితుల్లో ఏసీపీ, సీఐలు, ఎస్ఐల వంటి అధికారులను ప్రయోగించడం తప్పని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యల కారణంగా ప్రజలు పోలీసులను విమర్శిస్తున్నారని, పోలీస్ శాఖ ప్రతిష్ట దెబ్బతింటోందని మెమోలో పేర్కొన్నారు. ఈ తప్పిదంపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో రెండు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సూచించారు. వివరణ లభించకపోతే, సరైన కారణం లేకపోయినట్టుగా పరిగణించి, అవసరమైన క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు.



# సాఫీగా జరుగుతున్న 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ...

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్
- 3 లక్షల 3 వేల 596 మంది రేషన్ కార్డులకు అందిన మూడు నెలల రేషన్
- ఖమ్మం అర్బన్ మండలంలోని శ్రీనివాస్ నగర్, ప్రకాష్ నగర్ లో రేషన్ షాపులను తనిఖీ చేసిన డిసిఎస్ఓ



**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ పంపిణీ ప్రక్రియ సాఫీగా జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, ఖమ్మం అర్బన్ మండలంలోని శ్రీనివాస్ నగర్, ప్రకాష్ నగర్ లో రేషన్ షాపులను డిప్యూటీ తహసిల్దార్ తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెలలో 3 నెలల రేషన్ ను రేషన్ కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని, దీని కోసం మన జిల్లాకు 21 వేల 915 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం స్టాక్ వచ్చిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 4 లక్షల 15 వేల 904 రేషన్ కార్డులకు ఇప్పటి వరకు 3 లక్షల 3 వేల 596 రేషన్ కార్డులకు రేషన్ షాప్ ల నుంచి మూడు నెలల రేషన్ అందిందని అన్నారు. రేషన్ బియ్యం సరఫరా అంశంలో అప్రమత్తంగా ఉండాలని, అక్రమ బియ్యం రవాణా జరగకుండా ఉండేందుకు అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో, ఆర్డిఓ ల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు చేపట్టిన తనిఖీలలో భాగంగా ఖమ్మం అర్బన్, పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, తల్లాడ మండలాల్లో ఇప్పటి వరకు 5 అక్రమ బియ్యం రవాణాదారులపై 6ఏ కేసులు నమోదు చేసి 7 లక్షల 29 వేల రూపాయల విలువ గల 213 క్వింటాళ్ల సన్న బియ్యంతో పాటు 12 లక్షల 50 వేల రూపాయల విలువ గల 3 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. రేషన్ డీలర్లు రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యం సక్రమంగా అందించాలని, జూన్ 30 వరకు అన్ని రేషన్ షాపులు తెరిచి ఉంచి బియ్యం పంపిణీ చేయాలని, రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా తమ రేషన్ తీసుకుని వెళ్లి సన్నబియ్యం పథకం సద్వినియోగం చేసుకోవాలని, సన్న బియ్యం బయట అమ్మితే రేషన్ కార్డు రద్దు చేయడం జరుగుతుందని, అలాగే కొన్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు.

# పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకం కలిసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



హనుమకొండ జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.





# ఖమ్మం జిల్లా ప్రగతి కొనసాగించాలి ...

- ముజమ్మిల్ ఖాన్
- ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పటిష్ట చర్యలు
- బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహణ

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమ అంశాలలో ఖమ్మం జిల్లా కొనసాగిస్తున్న విజయగాథను కొనసాగించాలని బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్రంలో నిర్వహించిన ఐఎఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ సంచాలకులుగా బదిలీపై వెళ్తున కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా అధికారుల బృందం నిర్వహించారు.

కలెక్టరేట్ కు చేరుకున్న ముజమ్మిల్ ఖాన్ కు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్.సి.సి. కెడేట్స్, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రగతిని ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నారని, స్నేహపూర్వక వాతావరణంలో అధికారులంతా మంచి బృందంగా ఏర్పడి ప్రజా సమస్యలు పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేసేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారని అధికారులు వెల్లడించారు.

అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి, రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, పలువురు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో తమకు ఉన్న అనుభవాలను తెలియజేశారు.

**అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి:**

ఈ సందర్భంగా బదిలీ పై పౌరసరఫరాల శాఖ సంచాలకులుగా వెళ్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ గా తన ప్రస్థానాన్ని ముజమ్మిల్ ఖాన్ వివరించారు. ఖమ్మం నేల చాలా పవిత్రమైందని, ఇక్కడ పని చేయడంలో చాలా సంతృప్తి లభిస్తుందని, వరదల సమయంలో ఇక్కడి అధికారులు, సిబ్బంది అద్భుతంగా పని చేశారని అన్నారు. ప్రజలకు నేరుగా క్షేత్రస్థాయిలో ఇంటారాక్ట్ అవుతూ వారి సమస్యలు పరిష్కరించేందుకు తనకు అవకాశం లభించిన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. హుస్నాబాద్ లో సబ్ కలెక్టర్ గా మొదటిసారి విధులకు చేరిన కొత్తలో ఒక ముసలావిడ తన దగ్గర వచ్చి దరఖాస్తు ఇచ్చి సమస్య పరిష్కారం చేయాలని కోరిందని, తాను ఇటీవలే చేరానని తన పరిధిలో రాదని చెప్పినా కలెక్టర్ కాబట్టి పరిష్కరించాలని ఆ ముసలమ్మ అడిగినప్పుడు ప్రజలకు వ్యవస్థ పట్ల ఉన్న నమ్మకం మొదటిసారి గమనించానని అన్నారు.

కలెక్టరేట్ వ్యవస్థ 250 సంవత్సరాల నుండి ఉందని, మనకు వ్యక్తిగతంగా ఎటువంటి గౌరవం, గుర్తింపు ఉండదని, వ్యవస్థకు ఆ గౌరవం లభిస్తుందని అన్నారు. మనం ఉన్నా లేకపోయినా వ్యవస్థ ప్రజల కోసం పని చేయాలని, వ్యక్తిగత కాంట్రిబ్యూషన్ ఒక్కటి రెండు శాతాలు మాత్రమే ఉంటాయని అన్నారు. మనం న్యాయం ప్రకారం విధులు నిర్వహిస్తే ప్రజల ముఖాలపై కనిపించే సంతోషం నుండి వచ్చే సంతృప్తి ఎక్కడా లభించిందని అన్నారు. శాంతి భద్రతలు సరిగా ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. వరదల సమయంలో కార్యాలయానికి పరిమితం కాకుండా పోలీస్ కమిషనర్ నేరుగా ప్రజలలో వెళ్లి పని చేశారని కలెక్టర్ తెలిపారు.

గత సంవత్సరం భారీ వరదల నేపథ్యంలో వరద సహాయక చర్యలు, సాధారణ పరిస్థితులను పునరావృతం చేయడం వంటి అంశాలలో ఉద్యోగులు సఫలీ కృతులయ్యారని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను విజయవంతంగా సకాలంలో పూర్తి చేయడం కారణంగా వరదల విపత్తుల నుంచి బయటపడ్డామని, భవిష్యత్తులో వరదలు వస్తే ఎలా ఎదుర్కోవాలో పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నామని అన్నారు.

మహిళలు అన్ని ప్రాంతాలు, మతాలు, కులాల వారిగా గత కొన్ని దశాబ్దాలుగా వివక్షకు గురయ్యారని, దానిని నివారించేందుకు మహిళలను బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 50 శాతం జనాభాను విస్మరిస్తే అభివృద్ధి సాధ్యం కాదని, తన సొంత కుటుంబంలో కూడా మూడవా తరం అద్భుత స్థితిలో ఉందంటే కారణం ఒక మహిళ చదువుకోవడం మాత్రమేనని అన్నారు. దేశం చాలా మారిందని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు బాధ్యత, పారదర్శకత పెరిగిందని, ప్రజలు నిరంతరం గమనిస్తూ మన పని తీరు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. మనం ఆశించే మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. బాల సదనంలో పిల్లలను మన పిల్లలుగా భావించాలని అన్నారు. అసమానతలను తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. నవ సమాజ నిర్మాణానికి పునాది సంక్షేమ శాఖ ద్వారా వేసే అవకాశం ఉంటుందని, బాల సదనం, అంగన్ వాడి కేంద్రాలకు చేసే పని చాలా సంతృప్తి కలిగించిందని అన్నారు.

మహిళా మార్ట్, స్త్రీ టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ, వరద సహాయక చర్యలు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన ఇలాంటి అనేక కార్యక్రమాలు విజయ వంతంగా ఖమ్మం జిల్లాలో అమలవు తున్నాయి అంటే దానికి కారణం ఇక్కడ చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉండటమేనని అన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయం నడవాలని అన్నారు. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ విధులతో పాటు తన కుటుంబానికి సమయం కేటాయించాలని అన్నారు.

మనకు ఒక పని ఉంటే అధికారులు ఏ విధంగా స్పందించాలని కోరుకుంటామో అదేవిధంగా మన కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మనం ప్రవర్తించాలని, ఈ అంశాన్ని ఉద్యోగులంతా గుర్తుంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ స్థాయిలో సేవలు అందించిన ఖమ్మం జిల్లా తనకు ఎప్పుడు ప్రత్యేకంగా నిలుస్తుందని, 12 నెలల కాలంలో తనకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధి చెందేందుకు, జిల్లా యంత్రాంగం ఉత్సాహంగా పని చేసేందుకు అధికారులను ఎప్పటికప్పుడు మోటివేట్ చేసేందుకు పదవి విరమణ పొందుతున్న సిబ్బందిను సన్మానిస్తూ ప్రస్థానం కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలెక్టర్ ఇంటారాక్ట్ అవుతూ వారికి ఏ అవసరాలు ఉన్నాయి, ప్రభుత్వం పరిధిలో వాటిని ఎలా నేరవేర్చాలి అనే కోణంలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని అన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సజావుగా గత 11 నెలల సమయం గడిచిందని, మహిళల అభ్యున్నతి, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యా శాఖపై కలెక్టర్ తనదైన ముద్ర వేశారని అన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమయంలో జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన ఏవీ ను ప్రదర్శించారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు వివిధ సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, తహసిల్దార్ లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి , జిల్లా అధికారులు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గోన్నారు.

# ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయండి

- ఖమ్మం మహాసభల జయప్రదం కోసం కృషి చేస్తున్న కార్యకర్తలు అందరికీ అభినందనలు
- రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు వెంకటేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**




జూన్ 21,22 తేదీల్లో ఖమ్మంలోని (కామ్రేడ్ నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్) కామ్రేడ్ ఎర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఏ హాల్) లో జరగనున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి ఖమ్మం డిపో వద్ద డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం వెంకటయ్య,గుగ్గిళ్ళ రోశయ్యల ఆధ్వర్యంలో మహాసభల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించి గోడలపై ప్రదర్శించారు.కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ఖమ్మంలో జరుగుతున్న ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలలో ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరుగుతాయని, గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునే మహాసభల జయప్రదం కోసం సహకరిస్తున్న ఆర్టీసీ కార్మికులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. మహాసభల జయప్రదం కోసం విశేషంగా ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికోద్యమాల చరిత్రలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ కు ప్రముఖమైన స్థానం ఉందని ఆర్టీసీలో ఐక్యత,పోరాటం నినాదంతో ఆవిర్భవించి ఆర్టీసీలో జరిగిన అన్ని ఐక్య పోరాటాల్లో సాధించిన విజయాల్లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రముఖ పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఐక్యపోరాటాల సంఘం గా ఆర్టీసీ కార్మికులందరి అభిమానాన్ని చూరగొన్న ఫెడరేషన్ నాలుగవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరగటం సంతోషకరమన్నారు. మహాసభల జయప్రదం కోసం సహకరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగ,కార్మిక సోదరులు అందరికీ మాధవరావూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు,రీజియన్ ఉపాధ్యక్షులు వి.సురేష్,డిపో కమిటీ ఉపాధ్యక్షులు బుగ్గవీటి లింగమూర్తి,సహాయ కార్యదర్శి వి.సురేష్,ఎస్.నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య విమర్శ

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**



ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 17 నెలల పాలన పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అప్రయోజకమైనవిగా మిగిలిపోయాయని విమర్శించారు.

420 హామీలతో పాటు ఆరు గ్యారంటీలను కూడా అమలు చేయలేకపోయారని తెలిపారు. ఎస్ఎల్బీసీ ఘటనలో ఎనిమిది మంది మరణించినా ఇప్పటికీ శవాలు దొరకలేదని, భారీ వర్షాలకు ప్రాజెక్టులు దెబ్బతిన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఖమ్మంలో వాగులు తెగిపోవడాన్ని, లగచర్ల రైతులపై నిరంకుశ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు.

రైతు రుణమాఫీ వాస్తవానికి దూరమైందని, రైతుబంధు, రైతు భరోసా పేరిట కూడా మోసమే జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల దృష్టితోనే ఈ పథకాలను అమలు చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, స్కూటీలు, పెన్షన్ల వంటి హామీలన్నీ వాయిదా పడ్డాయని అన్నారు.

రేవంత్ రెడ్డి ముట్టుకున్న ప్రతి విషయంలో విఫలమవుతున్నారని, గతంలో 50 లక్షల నగదు కేసుతో అరెస్టయ్యాక ఆయన బీఆర్ఎస్ నేతలపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారని రాజయ్య ఆరోపించారు. కేటీఆర్‌పై 14 అక్రమ కేసులు, కేసీఆర్, హరీష్ రావుపై విచారణలు అందుకు నిదర్శనమని విమర్శించారు.

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి తీరుపైనా రాజయ్య మండిపడ్డారు. ఆయన అనుచరులు ఇండ్ల కేటాయింపుల్లో అక్రమాలు చేస్తుండగా, ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. శివునిపల్లిలో భూములు కబ్జా చేసి అమ్మిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

అధికారులు ఈ అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఉద్యమానికి దిగుతుందని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలంటే కార్యకర్తలంతా గ్రామాల్లోకి వెళ్లి ప్రజల్లో విశ్వాసం కలిగించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తెలుగు భాషకు ఖండవల్లి సేవ

తెలుగునాట తెలుగు భాష నేర్చుకోవడానికి అవకాశాలు మృగ్యమైన కాలంలో మాతృ భాషపై మమకారంతో విద్యార్థులకు తెలుగు భాష నేర్చుకునే అవకాశం కల్పించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం చేసిన కృషి అనన్య సామాన్యం. సానుకూల దృక్పథంతో, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవలు అందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రథమంగా ప్రాచ్య కళాశాలను, తెలుగు మీడియం సాయం కళాశాలను, ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి, వాటికి విశాలమైన భవనాలు కట్టించారు. తన ఇంటిలోనే వేద పాఠశాలను 1980లో స్థాపించి సర్వ వర్ణాల వారికి తానే వేదాన్ని స్వయంగా బోధించారు. ఆంధ్ర రచయితల సంఘానికి 1957లో అధ్యక్షులై అనేక గ్రంథాలను ముద్రించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో శరవేగంగా రాసేవారు. మద్రాసు మెయిల్, దక్కన్ క్రానికల్, భారతి, కృష్ణా, స్రవంతి మొదలైన పత్రికలలో అనేకమైన వ్యాసాలు ప్రకటించారు.

ఖండవల్లి లక్ష్మీరంజనం (మార్చి 1, 1908 జూన్ 18, 1986) సుప్రసిద్ధ సాహిత్యవేత్త, పరిశోధకులు. ఆయన తూర్పు గోదావరి జిల్లా పెదపూడి గ్రామంలోని మాతామహులైన కోరాడ నరసింహులు ఇంటిలో మార్చి 1, 1908న జన్మించారు. సూర్యనారాయణ, సీతమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉద్యోగ రీత్యా వరంగల్లుకు రావడంతో ఆయన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యలు మట్టెవాడలో, హనుమకొండ లోను పూర్తయ్యాయి. తరువాత ఉన్నత విద్యకై హైదరాబాదు చేరుకుని 1924లో నిజాం కళాశాలలో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1928లో నిజాం కళాశాలలో తెలుగు, సంస్కృతం, ప్రాచీన భారత చరిత్రలలో బి.ఎ. పట్టా పొందారు.



తరువాత సిటీ కళాశాలలో అధ్యాపకులుగా చేరి 1936లో తెలుగు, సంస్కృతాలలో ఎం.ఎ. పరీక్షలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వ ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు. 1936లో ఎంఏ (తెలుగు సంస్కృతం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు లెక్చరర్ గా చేరారు. రాయప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్ఠించారు. ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడిరది. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా చేరి, తరువాత 1946లో ఆ శాఖకు అధ్యక్షులై, 1964లో పదవీ విరమణ చేశారు. ఆయన కృషి కారణంగా తెలంగాణలో 1956 నుంచి ప్రాచ్య భాషాధ్యయనంలో డిగ్రీ తరగతులు (బీ ఓ ఎల్) మొదలయ్యాయి. 1957 నుంచి ఓరియంటల్ కళాశాలలు సాయంకాలం పూట పనిచేసేలా ప్రారంభమయ్యాయి. ఇంగ్లీషు భాషా పరిచయం లేని పేదసాదా విద్యార్థులు ఈ కళాశాలల్లో చదివి, ఎంఏ తెలుగు, సంస్కృతం పట్టాలు పొంది కళాశాలల ఉపన్యాసకులు కాగలిగారు. 1966లో తెలుగు మాధ్యమంలో సాయం డిగ్రీ కళాశాలను స్థాపించారు. 1960లో హైదరాబాదులో వేద పాఠశాలను ప్రారంభించి, తాను కూడా తరగతులు తీసుకునేవారు. ఉస్మానియాలో ఆయన కాలంలో తెలుగు శాఖ బాగా అభివృద్ధి చెంది, తెలుగు ఎం.ఎ. చదివే విద్యార్థుల సంఖ్య పెరిగి, 1952 నుండి తెలుగులో పి.హెచ్.డి. పట్టాలకు పరిశోధన ప్రారంభమైంది. ఆయన రాసిన పుస్తకాల్లో ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, తెనుగుదుక్కి, లక్ష్మీరంజనం వ్యాసావళి, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మూడు సంపుటాలు, కాసె సర్వప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రము, శ్రీనాథుని హరవిలాసము (పరిష్కరణ గ్రంథాలు) ప్రసిద్ధాలు. ఆయన ఆంధ్ర మహాభారతం పరిశోధన ప్రతిని ఎనిమిది సంపుటాలుగా తెలుగు శాఖ పక్షాన ప్రకటించారు. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఒక విద్యాసంస్థను ప్రారంభించి బాల బాలికలకు వేరువేరుగా ఉన్నత పాఠశాలలను నెలకొల్పారు. కొమర్రాజు లక్ష్మణరావు... విజ్ఞాన సర్వస్వం ముద్రించడంలో ఖండవల్లి విశిష్టమైన కృషిచేశారు. ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము' అనే చక్కని రచన చేశారు. సోదరుడు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి తెలుగులోను, ఇంగ్లీషులోను రచించిన 'ఆంధ్రుల చరిత్ర సంస్కృతి' అమూల్యమైన గ్రంథం. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ గాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులుగా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా 1964లో విశ్రాంతి తీసుకున్నాక, మరో 22 సంవత్సరాలు సాహిత్య సేవ చేసి, 1986, జూన్ 18న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వ ప్రాచ్య కళాశాలగా అభివృద్ధి చెందింది. ఖండవల్లి శత జయంతి, కళాశాల స్వర్ణోత్సవాలు 2008లో హైదరాబాదులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించారు.

## మూడుముళ్ల బంధాలు...

ఎక్కడో పుట్టిన
ఎక్కడో పెరిగిన
రెండు హృదయాలు
తాళిబొట్టు తాకిడితో
ఒక బంధంగా మారిన వేళ...

బంధాల మేళా...
అనుబంధాల హేల...
స్నేహ...ప్రేమ..వివాహ
రక్త సంబంధాలు...
పేగు బంధాలు...అన్నీ వారధులే...

కొన్ని పరిచయాలు పచ్చికలౌతాయి...
కొన్ని అపార్థాల అగ్నిలో
ఆహుతౌతాయి...
కొన్ని అకస్మాత్తుగా కలుస్తాయి...
కొన్ని వెన్నెముకలా విరిగిపోతాయి...


అవసరాలకు
అనుకోని కలయికలతో
పుట్టిన బంధాలు
కాలం పరీక్షకు నిలబడవు.
నేడు కట్టిన తాళి...

రేపు తెగిపోవచ్చు! నేడు పెట్టిన
సుముహూర్తమెంతో శుభమైనా..
తుదితీర్పు మాత్రం ఆ పరమాత్మదే...!

ఎల్లలు దాటి ఏర్పడతాయి
అంతర్జాతీయ పెళ్లి సంబంధాలు
ఆంధ్ర అబ్బాయికీ అమెరికా అమ్మాయికీ
జత కుదురుతుంది విదేశాల్లో వింతగా
"Marriages are made in Heaven
But announced on Earth!"
అన్న మాట నేటికీ నిజమే!

పక్క ఊరిలో కుదిరిన బంధం
పది రోజుల్లోనే చిక్కుల్లో
చిక్కుకొని ముక్కలౌతుంది !
ఓ కన్నీటి కథగా మిగిలిపోతుంది...

అవును...
ఏ బంధాలనైనా...
భవబంధాలనైనా...
అనుబంధాలనైనా...
రక్త సంబంధాలనైనా...పెంచేది
తృటిలో తెంచేది ఆ భగవంతుడే...!





రచన:
కవిరత్న
సాహిత్యధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్
చరవాణి...9110784502

## ఓటు విలువెంత




నేత గారి రాకకై నడిరోడ్డున
ఎదురు చూసి ఆసుపత్రి బండి లో
అలిసి ఆగిన ప్రాణమంత

జరగమంటూ జాగా కోసం
జగడమాడి జరుపుకున్న
రణంలాంటి రైలు పెట్టెలో
జన జాగారాల యాత్రంత

భరత భూమి స్తన్యమంటి వెలకొనని
ఖనిజాలను
కారుచౌకగ కట్టబెడితే
అడగలేక ఆర్పేసిన నా కడుపులో నిప్పు
కణికంత

బాధితుడిగా బరితెగించి
న్యాయ దేవత చెంతజేరితే
బంకలాగా ఏళ్ళు సాగిన దొరకలేని
న్యాయమంత

ఓటు రోజు సెలవనుకుని
సొల్లు కబుర్లు చెప్పుకుంటూ
సల్లగా నిద్రించిన నా ఒక్కరోజు సుఖమంత

ఎదురొడ్డి ఎలాగోలా ఎన్నుకున్న
ప్రభుత్వాన్ని
పదోరోజు పడదోసే
ప్రజాస్వామ్య హంతకుల
నల్లధనపు మూటల్లో చెద పట్టిన నోటంత

కక్కేసిన వాంతిలా అదే
పాత పరిపాలన
మార్చి మార్చి మళ్ళీ తినే కుక్కలాంటి నా
బ్రతుకంత.



రచయిత:
నేపా సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత.8639442397.

# విమానయానం గాలిలో దీపం

ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్ర సీజన్‌లో వరసగా చోటు చేసుకొంటున్న హెలికాప్టర్ ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం కేదార్‌నాథ్‌నుంచి గౌరీకుండ్‌కు వస్తున్న హెలికాప్టర్ గుప్తకాశి వద్ద కూలిపోవడంతో పైలట్, రెండేళ్ల చిన్నారి సహా హెలికాప్టర్‌లోని మొత్తం ఏడుగురూ చనిపోయారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన నెలన్నర రోజుల్లోనే ఇది అయిదో హెలికాప్టర్ ప్రమాదం కావడం గమనార్హం. ఇంతకు ముందు కూడా గత మే 8న ఉత్తర కాశీలో గంగోత్రికి యాత్రికులను తీసుకు వెళ్తున్న హెలికాప్టర్ లోయలో పడిపోవడంతో ఆరుగురు ప్రయాణికులు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో మూడు హెలికాప్టర్ ప్రమాదాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అయితే నెలన్నర వ్యవధిలోనే ఇన్ని హెలికాప్టర్ ప్రమాదాలు ఎందుకు జరిగాయి? దీనికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ప్రతిఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆదివారం జరిగిన ప్రమాదానికి వాతావరణం హటాత్తుగా ప్రతికూలంగా మారడమే కారణమని తెలుస్తోంది. పైలట్ దట్టమైన పొగమంచు మధ్యలోకి వెళ్లి ఉండవచ్చని, ఎదురుగా ఏముందో కూడా కనిపించని స్థితిలో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోయి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రమాదం తెల్లవారు జామున 5.17 గంటల సమయంలో జరిగింది. వాస్తవానికి కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం 6 గంటల తర్వాతినుంచి సాయంత్రం వరకు మాత్రమే హెలికాప్టర్ సేవలకు అనుమతి ఉంది. దీనికి భిన్నంగా ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ తెల్లవారుజామునే బయలుదేరడాన్ని గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం అవుతుంది.

కేదార్‌నాథ్ ఆలయం హిమాలయ పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ వాతావరణం క్షణాల్లో మారిపోతూ ఉంటుంది. పైగా అంతా నిటారయిన కొండలు, లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. అలాంటప్పుడు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెలికాప్టర్ సేవలకు అనుమతించింది కానీ భద్రత విషయాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు. కంట్రోల్ టవర్స్ కానీ, వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించే ఏర్పాట్లు కానీ లేకపోవడంతో హెలికాప్టర్ ఆపరేటర్లు తమ ఇష్టానుసారం హెలికాప్టర్ సర్వీసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేసిన ప్రకటన సైతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అత్యవసర సమావేశం నిర్వహించాక రెండు రోజులు పాటు కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలకోసం కఠినమైన నిబంధనావళిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా డిజిసిఎ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కూడా ఏవియేషన్ కంపెనీలను ఆదేశించారు. హెలికాప్టర్ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటుగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇదంతా బాగానే ఉంది కానీ చార్‌ధామ్ యాత్రకోసం చాలా ఏళ్ల క్రితమే హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించిన రాష్ట్రప్రభుత్వం ఇంతకాలంగా ఈ అంశాలపై ఎందుకు దృష్టిపెటట్టలేదనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది. 2010లో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి కానీ ఇప్పటివరకు భద్రత విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించదు. వాస్తవానికి కేదార్‌నాథ్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నది. గతంలో దుర్గమమైన పర్వత మార్గంలో కాలినడకన, వృద్ధులు, పిల్లలు లాంటి వారయితే గుర్రాల మీద ఆలయానికి చేరుకునే వారు.

అయితే హెలికాప్టర్ సర్వీసును ప్రవేశపెట్టిన తర్వాత రోజు రోజుకు దానికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఏజన్సీ ఐఆర్‌సిటిసితో పాటుగా పలు ప్రైవేటు ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్ బుకింగ్‌తో పాటు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. యాత్రికులు సైతం ఈ సర్వీసులకే ఎక్కువ మొగ్గు చూపుతుండడంతో ఏవియేషన్ కంపెనీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా ఈ ఏడాది కేవలం 40 రోజుల్లోనే అయిదు ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర



విమాన ప్రమాదంలో దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందు మెదులుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దట్టమైన మంచు కారణంగా చార్‌ధామ్ యాత్రలో భాగమైన నాలుగు ఆలయాలను ఏడాదిలో ఆరు నెలల పాటు మూసి ఉంచుతారనే విషయం అందరికీ తెలిసిందే. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి పర్యాటకం ప్రధాన ఆదాయవనరు కావడంతో ఈ యాత్ర కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అదే ఇప్పుడు సమస్యలకు కారణమవుతోంది. ఆదాయంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపైన కూడా శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వరస ప్రమాదాల తర్వాతనైనా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించడం మంచి పరిణామమే. హెలికాప్టర్ సేవలపై నిఘాతో పాటుగా వాటి క్రమబద్ధీకరణ, వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలాంటి చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ఎంతో శ్రమకు ఓర్చి చార్‌ధామ్ యాత్రకు వచ్చే భక్తులు క్షేమంగా, యాత్ర ముగించుకుని స్వస్థలాలకు చేరుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

# ప్రకృతి పరవశించే పర్వదినం



ప్రతి సంవత్సరం జూన్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ విహార దినోత్సవం ఒక చిరస్మరణీయమైన సందర్భం. ఇది కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులతో కలిసి ప్రకృతి మధ్య సుఖంగా గడిపే అవకాశాన్ని కల్పించే పర్వదినం. ప్రకృతిలో మనుషుల అనుబంధాన్ని, విశ్రాంతిని, ఉల్లాసాన్ని ప్రతిబింబించే ఈ దినోత్సవం, వాస్తవానికి మన ఆరోగ్యానికి, భావోద్వేగాలకు, సమాజానికి విశేషంగా ఉపయోగపడే ఒక ప్రకృతి పండుగ లాంటిది. ఈ దినోత్సవం వెనక ఉన్న చరిత్ర స్పష్టంగా లిఖితంగా లేనప్పటికీ, 19వ శతాబ్దం నుంచే పాశ్చాత్య దేశాల్లో వేసవి కాలంలో కుటుంబాలు, స్నేహితులతో కలిసి పచ్చిక బయళ్లలో భోజనం చేస్తూ సమయం గడిపే సంప్రదాయం ప్రారంభమైంది. అప్పటి నుంచే ఇది ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ప్రజల జీవనశైలిలో భాగమైపోయింది. విహార దినోత్సవానికి అనేక ప్రకృతి నిర్మిత ప్రయోజనాలున్నాయి. ఆధునిక జీవితపు యాంత్రికత మధ్య ఒత్తిడిని తగ్గించేందుకు, ప్రకృతిలో ఒక రోజు గడిపితే మనసుకు ప్రశాంతత కలుగుతుంది. తాజా గాలిని పీల్చడం, పచ్చదనాన్ని వీక్షించడం, పక్షుల కిలకిల ధ్వనులను వినడరు విహారాలు మన ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే కాక, కుటుంబ బంధాలను బలపరిచే, మానవ సంబంధాలకు ఉత్సాహాన్ని అందించే వినూత్న మార్గంగా నిలుస్తాయి. ఈ రోజును సార్థకంగా చేసుకోవాలంటే, పార్కులు, సరస్సుల తీరాలు, జలపాతాలు, పర్వత ప్రాంతాలు వంటి పచ్చని ప్రదేశాలను ఎంచుకోవాలి. ఇంట్లోనే తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకెళ్లి ప్రకృతి సన్నిధిలో భోజనం చేయడం ఒక విశిష్ట అనుభవం. ఆటలు ఆడటం, పుస్తకాలు చదవటం, గానం చేయడం, పిల్లలతో సమయాన్ని గడపటరు అంతేకాదు, ఈ సందర్భాన్ని పర్యావరణ జాగ్రత్తల కోసం ఉపయోగించు కోవాలి. ప్లాస్టిక్ వాడకం నివారించాలి, శుభ్రత పాటించాలి, చెట్లను నాటి ప్రకృతికి కృతజ్ఞత తెలియ జేయాలి. విహారం అనేది చిన్న విరామం, నిత్య జీవిత ఆందోళనల నుంచి విముక్తి పొందే మార్గం. ఇది పర్యటన కన్నా మరింత సహజమైన, స్వేచ్ఛానుభూతిని కలిగించే అనుభవం. సాంకేతికత మధ్య చిక్కుకు పోయిన ఆధునిక మానవుడు సహజత్వాన్ని తిరిగి గుర్తుచేసుకునే అద్భుతమైన అవకాశం ఇది. ఈ దినోత్సవం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకమై, జీవితాన్ని హర్షభరితంగా ఆవిష్కరించు కోవచ్చు. ఈ రోజును కుటుంబ సమేతంగా, ప్రకృతి మధ్యలో గడిపితే, కేవలం మధుర జ్ఞాపకాలు మాత్రమే కాదు, జీవన శైలిలో ఒక మేలైన మార్పు కూడా ఏర్పడుతుంది. మనిషి మానవత్వాన్ని, ప్రకృతి ప్రేమను, మరియు అనుబంధాలను తిరిగి గుర్తు చేసే ఈ దినోత్సవాన్ని, ప్రతి ఒక్కరిమీ సమయాన్ని, సహృదయతను, పరిసరాలను పంచుకునే రోజుగా మార్చుకుందాం.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై పరిష్కారానికి హామీ

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్కను సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పీ. మధుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే. అరుణ్, మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.ఎస్.ఎస్ వాణి తదితరులు పాల్గొన్నారు.
పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థాయిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. వారు మరింత కృషి చేయాలనీ, ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. ఐఎఫ్ఎంఐఎస్ లో పెండింగ్‌గా ఉన్న చెక్కులను త్వరలో క్లియర్ చేస్తామని మంత్రి వెల్లడించారు.
పదోన్నతులకు మార్గం సుగమం చేసేందుకు, క్యాడర్ స్ట్రెంత్ పెంచేందుకు క్యాబినెట్ ఆమోదించినందుకు మంత్రి సీతక్కకు సంఘం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే, ఎన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవకు కృతజ్ఞతగా ఆమెకు సన్మానం నిర్వహించింది.ఈ సమావేశం పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారానికి కీలక మైలు రాయిగా మారుతుందన్న ఆశాభావం సంఘం నాయకుల్లో వ్యక్తమైంది.

## భద్రాద్రి కొత్తగూడెంలో నూతన నవోదయ విద్యాలయం ఏర్పాటు

- మాజీ ఎంపీ నామ
- బీఆర్ఎస్ పార్టీ చేసిన కృషి ఫలితమే నూతన నవోదయ విద్యాలయాలు మంజూరు

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



తెలంగాణ రాష్ట్రానికి ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరవడం బీఆర్ఎస్ పార్టీ సాగించిన నిరంతర కృషికి ఫలితమని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఈ విద్యాసంస్థలు స్థాపించబోతున్నాయని, ఈ ఏడాది జూలై 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారన్నారు. వీటితో రాష్ట్రంలో జవహర్ నవోదయ విద్యాలయాల మొత్తం సంఖ్య 16కి చేరిందని తెలిపారు. తెలంగాణ నూతన జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా కొత్త నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ తరఫున గట్టిగా డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నామ గుర్తు చేశారు. ప్రత్యేకించి భద్రాద్రి కొత్తగూడెం వంటి వెనుకబడిన జిల్లాల్లో ఈ పాఠశాలలు ఏర్పాటు కావాలని పార్లమెంటు వేదికగా మాట్లాడటమే కాకుండా, పలు మార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ విషయంలో కేంద్రానికి లేఖలు రాసినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి 21 నవోదయలు అవసరమన్నా, కేవలం 7 మాత్రమే మంజూరు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నవోదయ విద్యాలయాలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించేందుకు దోహదపడతాయన్నారు. గ్రామీణ యువతకు సువర్ణ అవకాశం లాంటి ఈ పాఠశాలలు వారికి నాణ్యమైన విద్యతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధత కల్పిస్తాయని నామ అన్నారు. ఈ విద్యా సంస్థలు కేవలం విద్యను అందించడంలోనే కాదు, గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నవోదయ విద్యాలయం ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు మెరుగైన భవిష్యత్తు దిశగా దారి వేసేలా అవుతుందని, వారి ప్రతిభను దేశస్థాయిలో వెలుగులోకి తీసుకొచ్చేలా చేస్తుందని నామ అభిప్రాయపడ్డారు. ఈ విద్యాలయాలు, నాణ్యమైన ఉచిత విద్యతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధత కల్పిస్తూ, వెనుకబడిన వర్గాలకు ఇది ఒక సువర్ణావకాశంగా నిలుస్తుందని నామ పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ తనదైన ప్రత్యేకతను చాటారు

- తుంబూరు దయాకర్ రెడ్డి

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



జిల్లా కలెక్టర్ గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వర్తించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్ ఖాన్ ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డి మంగళవారం కలిసి ఆయన సేవలను కొనియాడుతూ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.... జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి బదిలీ అయ్యేంత వరకు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రైతులకు సీఎం రేవంత్ గుడ్ న్యూస్.. 90% సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు..!!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లో 70,11,984 మంది రైతుల ఖాతాల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్రెడ్డి ప్రకటించారు. సోమవారం అగ్రికల్చర్ వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'రైతు నేస్తం' వేదిక నుంచి ఆయన ఆన్‌లైన్లో స్విచ్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు.
అనంతరం మాట్లాడుతూ.. రైతుల ఆశీర్వాదం లేకుండా ఎవరూ అధికారంలోకి రాలేరని, రైతు సంక్షేమమే పరిపాలనలో ముఖ్య లక్ష్యమని చెప్పారు. ''రైతును రాజును చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండుగ చేస్తం. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది.. ప్రజా ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే రైతుల సంక్షేమం కోసం రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టింది. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా అన్నదాతలకు అండగా నిలుస్తున్నం' అని పేర్కొన్నారు.

**నాడు వరి వేస్తే ఉరే అన్నరు**

''వరి వేస్తే ఉరి వేసుకోవాల్సిందేనని నాడు కేసీఆర్ అన్నడు. వరి వేయండి.. చివరి గింజ వరకు కొనే బాధ్యత మాది అని చెప్పిన ప్రభుత్వం మాది. చివరి గింజ వరకూ కొంటున్నం. తెలంగాణ రాష్ట్రం వరి పండించడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఒక్క సంవత్సరంలో 2.80 కోట్ల టన్నుల వడ్లు పండాయి' అని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు.
రైతుల కండ్లలో ఆనందం చూస్తున్నామని, ముఖ్యమంత్రిగా తనకు ఇంతకంటే ఇంకేం కావాలని ఆయన అన్నారు. ''పేదలకు సన్న బియ్యం ఇచ్చేందుకుగాను సన్న వడ్లు పండించేలా రైతులను ప్రోత్సహించాం. సన్న వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నం. సన్న వడ్ల ఉత్పత్తిలోనూ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. రైతుల శ్రమతో రైతులు సన్న వడ్లు పండించడం వల్లే ఇవాళ పేదలకు సన్నం బియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నం' అని తెలిపారు.
లీడర్లు గెలవాలంటే రైతన్నల ఆశీర్వాదం తప్పనిసరిగా ఉండాల్సిందేనని.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని అన్నారు. ''రైతు ఆశీర్వాదం లేకపోతే ఎవరూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరు. ఈ దేశంలో ఎవరు ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కావాలన్నా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా రైతుల ఆశీర్వాదం, రైతుల చేయూత ఉండాల్సిందే. వార్డు మెంబర్ కావాలన్నా, సర్పంచ్ కావాలన్నా, ఎంపీటీసీ కావాలన్నా, జెడ్పీటీసీ కావాలన్నా, జిల్లా పరిషత్లో గెలవాలన్నా, శాసనసభలో ప్రాతినిధ్య వహించాలన్నా, పార్లమెంట్కు వెళ్లాలన్నా, ముఖ్యమంత్రి కావాలన్నా రైతులు అండగా నిలబడి ఆశీర్వదిస్తేనే సాధ్యమని బలంగా విశ్వసిస్తున్న' అని ఆయన వివరించారు.

**ఇతర పంటలపైనా దృష్టి పెట్టాలి**

వరి పంటనే కాకుండా ఇతర లాభసాటి పంటలను పండించాలని రైతులకు సీఎం రేవంత్రెడ్డి సూచించారు. ''భూమి సారాన్ని భట్టి ఏ భూమిలో ఏ పండ్ల తోటలు వస్తాయో.. ఏ భూమిలో ఏ కూరగాయలు పండుతాయో.. ఏ భూమిలో ఏ పంట అధిక దిగుబడి వస్తుందో.. పత్తి వస్తుందా, మిర్చి వస్తుందా, లేకపోతే కందులు వస్తాయా అని ఆలోచించి సాగు చేపట్టాలి. మా కొడంగల్ తాండూరు ప్రాంతంలో మేం కందులు పండిస్తం.
తాండూరు కొడంగల్ కందిపప్పు అంటే గొప్ప పేరు ఉంది. అచ్చంపేట ప్రాంతంలో పోతే దోసకాయలు పండుతాయి. దోసకాయ, కందిపప్పు కూర ఎంత బ్రహ్మాండంగా ఉంటది.. చికెన్ మటన్ కూడా పనికిరాదు దాని ముందు. ఇప్పుడున్న పిల్లలకు ఆ రుచి తెలవకుంటానే పోయింది. కూరగాయలు, పండ్లు పక్క రాష్ట్రాల్లో నుంచి తెచ్చుకుంటున్నం. ఇక్కడే వాటిని పండించుకుందాం' అని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా ప్రజల కోసం రోజూ 18 గంటలు పనిచేస్తున్నామని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు.

**90% సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు**

సోలార్ పంపుసెట్లు, వాణిజ్య పంటలు, ఇతర పంటలపై రైతులకు కలెక్టర్లు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ ను సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి వ్యవసాయ పనిముట్లను 90% సబ్సిడీతో అందజేయాలని, సోలార్ విద్యుత్ ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రైతులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, భూమి సారాన్ని కాపాడుతూ లాభసాటి పంటలు పండించేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన రైతులను గుర్తించి, వారికి రూ. 1,000 గౌరవ వేతనం ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

**రుణమాఫీ అయింది.. సన్నాలకు బోనస్ వస్తున్నది రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యాప్తంగా 1,034 రైతు వేదికల నుంచి రైతులు భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముచ్చటించారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక తమకు రుణమాఫీ జరిగిందని, సన్నాల సాగు ద్వారా బోనస్ వచ్చిందని వివిధ ప్రాంతాల రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

### డ్రిప్ ఇవ్వండి..

నాకు మూడెకరాలు భూమి ఉన్నది. కూరగాయలు పండిస్తా. మా ఊరు వికారాబాద్ జిల్లా చౌదరి పల్లి నుంచి రోజుకు ఆరు డీసీఎంల కూరగాయలు హైదరాబాద్కు వస్తున్నాయి. 700 ఫీట్లు బోర్ ఏస్తే నీళ్లు పడుతాయి. కూరగాయల సాగుకు మాకు డ్రిప్ ఇవ్వండి. చిన్న చిన్న పవర్ వీడర్లు కూడా ఇవ్వాలి. ఆలుగడ్డ పండిస్తే లక్ష రూపాయలు వచ్చినయి. మక్కలు పెడితే మంచి లాభం వచ్చింది. హైదరాబాద్ సిటీ చుట్టూ భూములన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లు అయినవి. ఒకప్పటి లెక్క పాల క్యాన్లు, కూరగాయలు సిటీకి వస్తలేవు. సిటీ చుట్టు కూరగాయలు, పండ్ల తోటలు పెంచాలి.

వెంకట రామయ్య, రైతు, చౌదరి పల్లి

### లక్షా 65 వేలు మాఫీ అయింది

మాది మహబూబాబాద్ జిల్లా జమాన్లపల్లి. నేను మిరప పంట ఎక్కువగా సాగు చేస్తుంటాను. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో నాకు రూ.1.65లక్షల పంటరుణం మాఫీ అయింది.

అజ్మీరా ద్వాలి, రైతు, జమాన్లపల్లి

## ఎంపీ రఘురాం రెడ్డి ఔదార్యంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు

- క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణ కుమారి, కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్
- వివిధ అడ్డాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన ఆటో డ్రైవర్లు

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:





పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఔదార్యం చూపి ఆటో డ్రైవర్ల కోసం ఖాకీ చొక్కాలను సిద్ధం చేయించారు. నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ వివిధ అడ్డాల నుంచి తరలివచ్చిన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆటో డ్రైవర్లకు.. యూనిఫామ్ చొక్కాలను ఎంపీ సమకూర్చడం..ఎంతో సంతోషకరమని అన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో..ఐ ఎన్ టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్. విప్లవ్ కుమార్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, నాయకులు పరికిపల్లి శ్రీను, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, సంఘం బాధ్యులు సిద్దల నగేష్, తోట సైదులు, కే. మధు, ఏ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 22న జరిగే గొర్రెల పెంపకం దారుల సమావేశం ను జయప్రదం చేయండి

- కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మేకల మల్లిబాబు యాదవ్, చిలకల వెంకట నరసయ్య, చిత్తారు సింహాద్రి యాదవ్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



ఈనెల 22 ఆదివారం నాడు ఖమ్మం జిల్లా గొర్రెల పెంపకం దారుల సమావేశం ఖమ్మం బైపాస్ రోడ్ రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో కురుమ యాదవుల సమస్యలపై భవిష్యత్తు ప్రణాళికను అనుసరించి సన్నాహక సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి జిల్లాలోని సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు, యాదవ కురుమ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, ప్రముఖ సామాజికవేత్త లిక్కి కృష్ణారావు, గొర్రెల పెంపకం దారుల జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా మహిళా నాయకురాలు కనక బండి విజయలక్ష్మి ఖమ్మం లో జరిగిన విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు. ఈనెల 22 న ఖమ్మం బైపాస్ రోడ్ లోని రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగే గొర్రెల పెంపకం దారుల సమావేశము యొక్క కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఆవిష్కరణ అనంతరం మేకల మల్లిబాబు యాదవ్ తో పాటు వక్తలు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కురుమ యాదవులు కీలక పాత్ర వహించారని, అయినా రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదని
తెలంగాణలో బీసీలలో అధిక శాతం ఉన్న యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించకుండా కొన్ని రాజకీయ శక్తులు అడ్డుకుంటున్నాయని, గతంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, కురుమ యాదవులకు ప్రాధాన్యత కల్పించేవారని, అంతేకాకుండా కురుమ యాదవుల కులవృత్తి అయిన గొర్రెల పెంపకం పాడివృత్తిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రస్థాయి జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులు కల్పించాలని, యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్ పరిధిలోని కురుమ యాదవులకు గొర్రెలకు బదులు పాడి గేదెలు మంజూరు చేయాలని, ఎన్సీడీసీ, ఎస్ ఆర్ డి పి స్కీములను పునరుద్ధరించి రుణం పెంచాలని, తదితర డిమాండ్లతో భవిష్యత్తులో ప్రభుత్వాలను అడిగే క్రమంలో భవిష్యత్ ప్రణాళికను అనుసరించి జరిగే సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్లు మల్లె బోయిన శ్రీనివాస్, గూదే భద్రయ్య, జొన్న బోయిన పాపయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ మారుతి ఎట్టయ్య, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, సంఘాల అధ్యక్షులు సోమన బోయిన లింగయ్య, మల్లె బోయిన ఉపేందర్ బట్ట కోటేశ్వరరావు, మంద నాగేశ్వరరావు, దొంతబోయిన ఉపేందర్ తెల్లబోయిన రమణ, తోడేటి లింగరాజు వాకదాని కోటేశ్వరరావు కాలువ నరసింహారావు, పెద్ది బోయిన నారాయణ, తదితరులు పాల్గొన్నారు

# పల్లెల్లో స్థానిక సందడి!

- నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం
- మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- ఆ తరువాతే పంచాయతీలకు..
- సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- గ్రామాల్లో మొదలైన రాజకీయ సందడి

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమ వుతుండటంతో గ్రామాల్లో రాజకీయ నేతల్లో హడావుడి ప్రారంభమైంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినా.. ఎన్నికలు నిర్వ హించకపోవడంతో కేంద్రం నిధులు నిలి చిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే పరిస్థితి నెలకొంది. దీనికితోడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే స్థితిలో ప్రభుత్వం లేదని ప్రతిపక్షాల నుంచి విమర్శ లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధ మైంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి ప్రకటన ఇందుకు ఊతం ఇస్తోంది.

**మొదట ప్రాదేశిక ఎన్నికలు**

మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాతే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వ హించే అవకాశం ఉంది. అయితే జూలై రెండో వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్ని కలు నిర్వహించాలంటే ఈ నెల చివరిలో గా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. లేదంటే వచ్చే నెల మొదటి వారంలో షెడ్యూల్ ఇస్తే వచ్చే నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహిం చే వీలుంటుంది.

**ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు**

పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం జరగడం తోపాటు ఎన్నికలకు సంబంధించి అధికా రులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో బ్యాలెట్ పేపర్ల ముద్రణ ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులను కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి తెప్పించి వాటికి మరమ్మ తులు చేసి సిద్ధంగా ఉంచారు. గ్రామాలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేశారు. బ్యాలెట్ పేపర్లను తెచ్చి ఎస్పీ కార్యాలయంలో భద్రపరిచారు. ఎన్ని కల సంఘం ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నా మని యంత్రాంగం చెబుతోంది.




**స్థానిక సంస్థల వివరాలు ఇలా..**

జెడ్పీటీసీలు –33
ఎంపీటీసీలు –352
గ్రామ పంచాయతీలు –868
ఓటర్లు –10,78,335

**బీసీ రిజర్వేషన్లు తేలకపోవడంతో వాయిదా..**

బీసీ రిజర్వేషన్ల తేలకపోవడంతో గతంలో నిర్వహించాలనుకున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయం ఇప్పటికీ కోర్టులో ఉంది. ఆ సమస్య ఎటూ తేలలేదు. కానీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**పెరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు**

గత ఎన్నికల్లో జిల్లాలో 31 మండలాలు ఉండగా ఆ తరువాత రెండు మండలాలు (గట్టుప్పల్, గుడిపల్లి) కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో రెండు జెడ్పీటీసీ స్థానాలు పెరుగను న్నాయి. దీంతో జెడ్పీటీసీ స్థానాల సంఖ్య 33కు చేరకుంది. అదే విధంగా జిల్లాలో గత ఎన్నికల సమయంలో 349 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇటీవల చేపట్టిన ఎంపీటీసీ స్థానాల పునర్విభజనలో మరో 3 పెరిగాయి. దీంతో ఎంపీటీసీల సంఖ్య 352 చేరింది. ఇక గ్రామ పంచాయతీలు గతంలో 844 ఉండగా.. కొత్తగా 24 పంచాయతీలు పెరిగాయి. దీంతో పంచాయతీలసంఖ్య 868కి చేరింది.

**జెడ్పీ చైర్మన్ మినహా మిగతా రిజర్వేషన్లు ఇక్కడే..**

జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించి ఆయా నియోజక వర్గాల వారీగా ఉన్న జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. వాటిని కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. అయితే పంపిన జాబితా ఆధారంగా రిజర్వేషన్ల కు ప్రభుత్వం ఆమోదించి తిరిగి జిల్లాకు పంపుతుంది. జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ మాత్రమే రాష్ట్ర స్థాయిలో ప్రకటిస్తారు.

**సిద్ధమవుతున్న పార్టీలు**

జిల్లాలో రాజకీయ పార్టీలు స్థానిక ఎన్నికల కు సిద్ధం అవుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజక వర్గాలుంటే సూర్యాపేట మినహా 11 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అంతకుముందు పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభు త్వ పాలన వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి తమ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా బీ ఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీకి జిల్లాలో ఎమ్మెల్యేలు లేకపోయినా ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో స్థానిక సంస్థల ఎన్ని కల్లో ఈసారి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రణాళికలు రచిస్తోంది.



# వచ్చే నెలలోనే స్థానిక ఎన్నికలు..

## మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ..!!

- వారం, పది రోజుల్లో మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం
- కేబినెట్లో నిర్ణయం జరిగేదాకా బయట మాట్లాడొద్దని సూచన
- బనకచర్లపై కేంద్రం దగ్గరే తేల్చుకుందామని వెల్లడి
- ఇందుకోసం 18, 19 తేదీల్లో ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయం



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

వచ్చే నెలలోనే స్థానిక సంస్థల ఎన్నిక లు ఉంటాయని.. ఇందుకు సిద్ధంగా ఉండాలని మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వారం, పది రోజుల్లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామన్నారు. స్థానిక ఎన్నికల విషయంలో కొందరు మంత్రులు చేస్తున్న ముందస్తు ప్రకటనలపై సీఎం అసహనం వ్యక్తంచేశారు. కేబినెట్ లో ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే ఎన్ని కలపై మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు. పైగా ఈ అంశం హైకోర్టులో ఉన్న విషయం గు ర్తుపెట్టుకుంటే మంచిదని సూచించారు. ''మంత్రులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేయకుండా.. స్థానిక ఎన్నికలపై ప్రకటనలు చేయడం ఏంటి? ముందు ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేస్తోందో చెప్పుకోవడంపై దృష్టి పెట్టండి'' అంటూ సీఎం అన్నారు. ఇం టిగ్రేటెడ్ కమాండ్కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి మంత్రు లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికలకు వెళ్లేముందు బీసీ రిజ ర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంటుందన్నా రు. లీగల్సమస్యలు వస్తే పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్ని కలపై ముందుకు వెళ్లాల్సి ఉంటుందని మంత్రులకు సూచన ప్రాయంగా తెలిపారు.

హైకోర్టులో స్థానిక ఎన్నికలపై ఇప్పటికే విచారణ కొనసాగుతోందని, అది త్వరలో నే క్లియర్ అవుతుందని సీఎం పేర్కొన్నట్టు తెలిసింది. ఈ నెల చివరి వారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటుచేసి లోకల్బాడీ ఎన్ని కల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకుం దామని స్పష్టం చేశారు. ముందు సర్పంచ్ ఎన్నికలా? లేదంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలా? అనేదానిపై ఆ రోజే డిసైడ్ చేయాలనే అభిప్రాయానికి వచ్చారు.

**మంత్రులు పనితీరు మెరుగు పర్చుకోవాలి..**

''మనది రైతు సంక్షేమ ప్రభుత్వం. ఈసారి వానాకా లం సీజన్ ముందే వచ్చినందున పెట్టుబడి సాయం కూడా ముందే ఇద్దాం. అందుకే రైతు నేస్తం కార్యక్ర మం ద్వారా రైతు భరోసాను కూడా సోమవారం నుంచే ప్రారం భించాం..'' అని మంత్రులకు సీఎం తెలిపారు. గతానికి భిన్నంగా ఈ సారి జూన్ నెల పూర్త య్యేలోపే రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు భరోసా నిధులు చెల్లిస్తున్నట్టు తెలిపారు. ప్రభు త్వ పథకాలను మంత్రులు విస్తృతంగా ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మంత్రులు వారి శాఖల్లో అమలవుతున్న స్కీములు, ఇతర సంస్కరణలు, కార్యక్రమాలపై నెలవారీగా టార్గెట్లు పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం సూచించారు. అప్పుడే పనితీరు మెరుగుపడు తుందన్నారు. డిపార్ట్మెంట్లలో ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేయాలన్నారు. కొత్తగా వచ్చిన ఇన్చార్జి మంత్రులతో.. ఆయా జిల్లాల మంత్రులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జోడెడ్ల మాదిరి అభివృద్ధి పనుల్లో ముందుండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇక ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రా జెక్టుపై కేంద్రం దగ్గరే తేల్చుకోవాలని డిసైడ్ అయినట్లు సీఎం మంత్రులకు తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి తెలంగాణ అభ్యంతరాన్ని వ్యక్తం చే స్తామని.. ప్రధాని నరేంద్ర మోదీ అపాయిం ట్మెంట్ కోసం కూడా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అపాయింట్మెంట్రాగానే ఆయనను కూడా కలుస్తామని సీఎం మంత్రు లకు వివ రించారు.

# నేటి నుంచి 4 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతుల ఖాతాల్లో జమ..!!

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా కార్యక్రమం కింద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెట్టు బడి నిధులు సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.

సీఎం రేవంత్ రెడ్డి వీటిని లాంఛనంగా ప్రా రంభించిన విషయం తెలిసిందే. అయితే.. గత రబీ సీజన్‌కు సంబంధించి.. పలు ప్రాం తాల్లోని చాలా మంది రైతులకు, ముఖ్యంగా నాలుగు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారికి ఇప్పటికీ నిధులు చేరలేదు. అప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆలస్యం జరుగుతుందని.. అందరికీ సహాయం అందుతుందని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు గతంలో హామీ ఇచ్చినా.. రబీ బకాయిలు ఇప్పటికీ జమ కాకపోవడంతో సదరు రైతులు తీవ్ర అయోమయంలో ఉన్నారు. తమకు ఇక ఈ సాయం రానట్టేనా అని లోలోపల చర్చించుకుంటున్నారు.

**రబీ బకాయిల సమస్య..**

గత రబీ సీజన్‌లో.. పైలట్ గ్రామాలలో మినహా.. పలు చోట్ల నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా మొత్తం చేరింది. ఆ పైన భూమి ఉన్న మిగిలిన అన్న దాతలకు ఆనాటి సాయం అందని పరిస్థితి నెలకొంది. ఎన్నికల హామీలో భాగంగా ఎటువంటి పరిమితులు లేకుండా అందరికీ రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. ఆర్థిక కారణాల వల్ల కొంతమందికి రాలేదు. అప్పటి నిధులు పూర్తి స్థాయిలో అందకముందే, ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను విడుదల చేయడంతో.. గతంలో బకాయిలున్న రైతుల్లో ఆందోళన ఎక్కు వైంది. ఈసారైనా తమకు పూర్తిగా నిధులు అందుతాయా లేదా అనే సందేహంలో ఉన్నారు.



ఒకవేళ స్థానిక ఎన్నికల నేపథ్యంలో కేవలం ఖరీఫ్ సీజన్ డబ్బులు మాత్రమే జమ చేసి.. రబీ సీజన్ బకాయిలు ఇక రావని సంకేతాలు వస్తే.. అది తమకు పెద్ద అన్యాయమని నాలుగు ఎకరాల పైన భూమి ఉన్న రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రైతులు, 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. నాలుగు ఎకరాలలోపు ఉన్న వారికి రబీ, ఖరీఫ్ రెండు సీజన్లకు (డబుల్ ధమాకా) నిధులు అందినందుకు కొంతమంది మిగతా వారిని వ్యంగ్యంగా చూస్తున్నారు. రెండుసార్లు రైతు భరోసా పొందిన వారిని చూసి, ఒక్కసారి మాత్రమే సాయం అందిన రైతులు కూడా తమకు అప్పటి రబీ, ఇప్పటి ఖరీఫ్ రెండు సీజన్ల డబ్బులు రావాలని కోరుకుంటున్నారు.

**ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి..**

గతంలో రబీ సీజన్ రైతు భరోసా అందక ఇబ్బంది పడిన రైతులు, వాటి కోసమే ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశలను తీర్చకుండానే మళ్లీ ఖరీఫ్ సీజన్ నిధులు ఖాతాల్లోకి వేయడం ప్రారంభిం చడం వారికి మరింత అయోమయాన్ని పెంచింది. ఈ సమస్యపై స్పష్టత ఇవ్వాలని.. అప్పుడు రైతు భరోసా రానీ నాలుగు ఎకరాల పైబడిన రైతులకు ఖరీఫ్, రబీ రెండు సీజన్ల కు సంబంధించి నిధులు జమ చేయాలని ముధోల్ తాలూకా బీఆర్ఎస్ సమన్వయ నాయకులు కిరణ్ కొమ్రేవార్ ప్రభుత్వాన్ని కోరారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో... ప్రభుత్వం రైతుల మధ్య ఉన్న ఈ అసం తృప్తిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని వర్గాల రైతులకు న్యాయం చేసి, వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగల రు. రైతు భరోసా పథకం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.. అన్నదాతలను అప్పుల ఊబి నుంచి బయటపడవేయడం, వ్యవసాయ పె ట్టుబడికి సాయం అందించడం. ఈ లక్ష్యం నెరవేరాలంటే.. పథకం అమలులో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని రైతులు, ప్రతి పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి... రబీ బకాయిలపై స్ప ష్టమైన ప్రకటన చేసి, అర్హులైన ప్రతి రైతుకు నిధులు అందేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఈ సారి ఎకరాలతో సంబంధం లేకుండా.. అందరికీ రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటిం చిన విషయం తెలిసిందే. దీంతో నేటి వరకు 3 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో ఖరీఫ్ సీజన్ నిధులు జమ అయ్యాయి. రేపటి నుంచి 4 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

# రైల్ రోకోకు కవిత పిలుపు

- రాజకీయ ఆందోళనకు బీసీ సంఘాలను మద్దతుగా పెట్టిన జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణలో రాజకీయ వేడి పెరుగుతోంది. జూలై 17న రైల్ రోకో చేపట్టాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుతో అనేక అనుమానాలు, చర్చలు రా జుకున్నాయి. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు ఇవ్వాలన్న డిమాండ్‌తో కవిత బీసీ సంఘాల మద్దతుతో ఉద్యమ కార్యాచరణకు పూనుకున్నారు.

మెదక్ జిల్లాలో బీసీ సంఘాల నేతలతో సమా వేశమైన కవిత, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకపోతే స్థానిక సంస్థల ఎన్నికలపై బహిష్కరణ మార్గం ఎంచుకుంటామని హెచ్చరించారు. అలాగే జూలై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో నిర్వ హించాలని పిలుపునిచ్చారు.




అయితే రైల్ రోకో లాంటి కార్యక్రమాలు చిన్న విషయం కావు. ప్రజా రవాణా వ్యవస్థ ను అడ్డుకుంటే తీవ్రమైన కేసులు నమోదు కావడం సహజం. తెలంగాణ ఉద్యమంలో సైతం రైళ్లను అడ్డుకున్న కేసులు తీవ్రస్థాయి లో దర్యాప్తుకు దారి తీసిన ఉదాహరణలే ఉన్నాయి. అలాంటి చర్యకు కవిత నేరుగా పిలుపివ్వడం రాజకీయంగా కీలకంగా మారింది.

కవిత చేస్తున్న ఈ ఉద్యమాలకు బీఆర్ఎస్ నుంచి ప్రత్యక్ష మద్దతు లేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో జాగృతి కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు పా ల్గొన్నా, ప్రస్తుతం కేవలం జాగృతి క్యాడర్ ఆధారంగా పిలుపులు, కార్యక్రమాలు జరు గుతున్నాయి. దీంతో కవిత–బీఆర్ఎస్ మధ్య దూరం మరింత పెరుగుతోందన్న విశ్లేషణ లు వినిపిస్తున్నాయి.


ఒకవైపు బీసీ రాజకీయం, మరోవైపు పార్టీతో దూరంగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తూ కవిత చేస్తున్న ఉద్యమాల దిశ, గమ్యం ఏం టన్నది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

## సిఎం రేవంత్ రెడ్డిని కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి జీవి వెంకటస్వామి

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అధికార నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జీవి వెంక టస్వామి మంగళవారం తన కుటుంబ సభ్యు లతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి లోక్‌సభ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ కూడా మంత్రి వెంట ఉన్నారు.

ఈ భేటీ సందర్భంగా రాష్ట్రాభివృద్ధి, రైతుల సంక్షేమం, కార్మికుల భద్రత తదితర అంశాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చిం చారు. ముఖ్యమంత్రి సరసన స్నేహపూర్వకం గా జరిగిన ఈ సమావేశం, పరస్పర అభిప్రా యాల మార్పిడి ద్వారా అభివృద్ధి దిశగా కృషిని



మరింత బలోపేతం చేసే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన సదవకాశానికి, ఆత్మీయ ఆహ్వానానికి మంత్రి వెంకటస్వామి కృతజ్ఞతలు తెలియజే శారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో మరింత ముందుకు వెళ్లేం దుకు తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తి స్తానని మంత్రి తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నొవాక్ జకోవిచ్‌కు మరో గ్రాండ్‌స్లామ్ కష్టమేనా ?



ప్రపంచ టెన్నిస్‌లో ఎదురులేని శక్తిగా పేరు తెచ్చుకున్న సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ కొంత కాలంగా గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ కోసం పరితపిస్తున్నాడు. 2023లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచి పురుషుల టెన్నిస్‌లో పెను ప్రకంపనలు సృష్టించిన జకోవిచ్ ఆ తర్వాత జోరు తగ్గాడు. 2024లో నొవాక్ ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకోలేక పోయాడు. ఈ ఏడాది జరిగిన రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లలో కూడా నొవాక్‌కు నిరాశే మిగిలింది. ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో ఫైనల్‌కు కూడా చేరుకోలేక పోయాడు. ఇటలీ సంచలనం జన్నిక్ సినర్, స్పెయిన్ యువ హీరో కార్లొస్ అల్కరాజ్‌లు ప్రస్తుతం ప్రపంచ పురుషుల టెన్నిస్‌లో జోరు కొనసాగిస్తున్నారు. కిందటి ఏడాది సినర్, అల్కరాజ్‌లు చెరో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలుచుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లలో సినర్, అల్కరాజ్‌లు ఒక్కో ట్రోఫీని సొంతం చేసుకున్నారు. చివరి ఆరు గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలలో సినర్, అల్కరాజ్‌లే మూడేసి సార్లు విజేతగా నిలువడం విశేషం. ఇలాంటి స్థితిలో సెర్బియా యోధుడు నొవాక్ కెరీర్‌లో మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధిస్తాడా లేదా అనేది సందేహంగా మారింది. ప్రస్తుతం జకోవిచ్ ఉన్నస్థితిలో యువ ఆటగాళ్లు సినర్, అల్కరాజ్‌లను తట్టుకుని గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించడం నొవాక్‌కు శక్తికి మించిన పనిగానే చెప్పొచ్చు. ఒకవైపు పెరుగుతున్న వయసు ఒక కారణం కాగా, రెండో వైపు ఫిట్‌నెస్, గాయాల సమస్య జకోవిచ్‌ను వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో తనకు ఎంతో కలిసి వచ్చే వింబుల్డన్ ఓపెన్‌లో జకోవిచ్ ఎంతవరకు రాణిస్తాడనేది ప్రశ్నార్థకంగా మారింది. అల్కరాజ్, సినర్, జ్వరేవ్ వంటి యువ ఆటగాళ్ల నుంచి అతనికి గట్టి పోటీ నెలకొంది. యువ ఆటగాళ్లు పూర్తి ఫిట్‌నెస్‌తో ముందుకు సాగుతుండగా జకోవిచ్ పూర్వవైభవం సాధించడానికి సర్వం ఒడ్డుతున్నాడు. కానీ ప్రస్తుతం పరిస్థితులను గమనిస్తే సినర్, అల్కరాజ్‌లను తట్టుకుని ముందుకు సాగడం జకోవిచ్‌కు దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. అయితే పట్టుదల, అంకితభావానికి మరో పేరుగా చెప్పుకునే నొవాక్‌ను తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు. ఎలాంటి స్థితి ఎదురైనా తట్టుకుని ముందుకు సాగే సత్తా అతనికి ఉంది. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌తో జకోవిచ్ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు.

# ఒకే జట్టులో భారత్, పాక్ ఆటగాళ్ళు..?

యార్క్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ భారతదేశానికి చెందిన రుతురాజ్ గైక్వాడ్ మరియు పాకిస్తాన్‌కు చెందిన అబ్దుల్లా షఫీక్‌లను తన జట్టులోకి చేర్చుకుంది. భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల మధ్య ఈ వార్తలు వచ్చాయి. అయితే, ఇద్దరు ఆటగాళ్లు వేర్వేరు మ్యాచ్‌లలో ఆడతారు. రుతురాజ్ కౌంటీ ఛాంపియన్‌షిప్ మరియు వన్డే కప్‌లో ఆడనుండగా, అబ్దుల్లా షఫీక్ౕ20 బ్లాస్ట్‌లో ఆడతాడు. భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య సంబంధాలు క్షీణించడం వలన, ఈ రెండు దేశాల క్రికెట్ జట్లు ఐసిసి ఈవెంట్లలో, ఆసియా కప్‌లో మాత్రమే తలపడేవి. దీంతో పాటు, రెండు దేశాల మధ్య ఎటువంటి సిరీస్‌లు ఆడటం లేదు. అదనంగా, పాకిస్తాన్ ఆటగాళ్లను ఐపీఎల్ నుంచి కూడా నిషేధించారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, రెండు దేశాల మధ్య అన్ని రకాల సంబంధాలు తెగిపోయాయి. అందువల్ల, బీసీసీఐ కూడా ఆసియా కప్ నుంచి వైదొలగాలని నిర్ణయించింది. ఐసీసీ ఈవెంట్‌లో రెండు జట్లను ఒకే గ్రూపులో ఉంచవద్దని ఐసీసీని అభ్యర్థించినట్లు చెబుతున్నారు. వీటన్నింటి మధ్య, రెండు దేశాల ఆటగాళ్ళు ఒకే జట్టు కోసం ఆడతారనే వార్తలు ఇప్పుడు చాలా చర్చను సృష్టించాయి. నిజానికి, యార్క్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ తన జట్టులోకి పాకిస్తాన్ బ్యాట్స్‌మన్ అబ్దుల్లా షఫీక్‌ను చేర్చుకుంటున్నట్లు ప్రకటించింది. 25 ఏళ్ల అబ్దుల్లా షఫీక్ వచ్చే వారం ఇంగ్లాండ్‌కు చేరుకుంటాడు. రోథెసే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లోని రెండు కీలక మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. అదనంగా టీ20 బ్లాస్ట్ చివరి నాలుగు గ్రూప్ దశ మ్యాచ్‌లలో అతను యార్క్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని యాజమాన్యం తెలియజేసింది. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే, భారత ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ కూడా గత వారం జట్టులో చేరాడు. రుతురాజ్ గైక్వాడ్ కౌంటీ ఛాంపియన్‌షిప్ డివిజన్ 1లో యార్క్‌షైర్ తరపున ఆడనున్నాడు. రుతురాజ్ ఐదు కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని భావిస్తున్నారు. ఆగస్టు 5 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 20 వరకు కొనసాగే వన్డే కప్‌లో కూడా రుతురాజ్ యార్క్‌షైర్ తరపున ఆడనున్నాడు. అయితే, భారత్ వర్సెస్ పాకిస్తాన్‌కు చెందిన ఈ ఇద్దరు ఆటగాళ్ళు కలిసి ఆడటం కనిపించదు. ఈ ఇద్దరు ఆటగాళ్లను వేర్వేరు మ్యాచ్‌ల కోసం జట్టులో చేర్చారు.







# అక్టోబర్ 5న పాకిస్థాన్‌తో భారత్ పోరు

భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు సంబంధించి షెడ్యూల్‌ను సోమవారం ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు ఈ వరల్డ్‌కప్ జరుగనుంది.సెప్టెంబర్ 30న బెంగళూరు వేదికగా జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య దేశాలు భారత్, శ్రీలంకలు తలపడుతాయి. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు కొలంబో ఆతిథ్యం ఇవ్వనుంది. అక్టోబర్ ఈ మ్యాచ్ జరుగనుంది. బిసిసిఐ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మధ్య హైబ్రిడ్ మోడల్ కోసం ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇరు దేశాల జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను తటస్థ వేదికలో నిర్వహించనున్నారు. ఇక మొదటి సెమీ ఫైనల్ అక్టోబర్ 29న గౌహతి లేదా కొలంబోలో నిర్వహిస్తారు. రెండో సెమీ ఫైనల్ అక్టోబర్ 30న బెంగళూరులో జరుగుతోంది. ఇక ఫైనల్‌ను నవంబర్ 2న బెంగళూరు లేదా కొలంబోలో నిర్వహించేందుకు ఐసిసి సిద్ధమైంది. ఒక వేళ పాకిస్థాన్ నాకౌట్ పోటీలకు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్‌లను శ్రీలంకలోనే నిర్వహిస్తారు. ఇక వరల్డ్‌కప్‌లో శ్రీలంకలో మొత్తం 11 మ్యాచ్‌లు జరుగనున్నాయి. మిగిలిన మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 30న శ్రీలంకతో, అక్టోబర్ 5న పాకిస్థాన్‌తో, అక్టోబర్ 9న సౌతాఫ్రికాతో విశాఖపట్నంలో, 12న విశాఖపట్నంలోనే ఆస్ట్రేలియాతో, అక్టోబర్ 19న ఇండోర్ వేదికగా ఇంగ్లండ్‌తో, 23న గౌహతిలో న్యూజిలాండ్‌తో, 26న బెంగళూరు వేదికగా బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

# ఆ క్రికెటర్ నన్ను రిటైర్ అవ్వమన్నారు..




అంతర్జాతీయ క్రికెట్‌లో జాతీయ జట్టులో స్థానం దక్కాలంటే ఎంతో అదృష్టం ఉండాలి.కొందరికి ఆ అదృష్టం తొందరగా వస్తే మరికొందరి విషయంలో మాత్రం చాలా ఆలస్యమవుతుంది. కొందరు క్రికెటర్లకు జట్టులో ఒకసారి చోటు దొరికినా.. మళ్లీ ఛాన్స్ కోసం ఎన్నో ఏళ్లు ఎదురుచూడాలి. అలాంటి పరిస్థితే భారత క్రికెటర్ కరుణ్ నాయర్‌కి ఎదురైంది. దాదాపు ఎనిమిది సంవత్సరాల తర్వాత కరుణ్ టీం ఇండియా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రెండు సంవత్సరాల క్రితం తనకు ఎదురైన ఓ ఘటనను అతను వెల్లడిరచారు. ఓ స్టార్ క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకోమని చెప్పారని.. ఆర్థికంగా భరోసా కోసం విదేశీ టి20 లీగ్‌లు ఆడమని సూచించినట్లు కరుణ్ పేర్కొన్నాడు. ఆ క్రికెటర్ చెప్పినట్లు చేయడం సులభమే కానీ, తన లక్ష్యం తిరిగి జాతీయ జట్టులో ఆడటమే అని అన్నారు. ఇప్పుడు తన విషయంలో అదే జరిగిందని అన్నాడు. ప్రస్తుతం కరుణ్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇండియాఎ, ఇంగ్లండ్ లయన్స్ మధ్య జరిగిన అనధికారిక మ్యాచ్‌లో అతను డబుల్ సెంచరీ సాధించాడు. జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా అతనికి మద్దతుగా నిలుస్తున్నారు.

# ఇంగ్లాండ్‌కు గంభీర్ పయనం




తల్లికి అనారోగ్యంతో స్వదేశానికి వచ్చిన భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ గౌతం గంభీర్.. తిరిగి ఇంగ్లాండ్‌కు పయనం అయ్యాడు. తల్లి సీమ గంభీర్ గుండెపోటుకు గురవటంతో ఈ నెల 11న ఇంగ్లాండ్ పర్యటన నుంచి హుటాహుటిన గంభీర్ న్యూఢల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. న్యూఢల్లీలోని గంగారామ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గంభీర్ తల్లి ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడిరది. కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలిచేందుకు స్వదేశం వచ్చిన గంభీర్.. జాతీయ జట్టు బాధ్యతల కోసం సోమవారమే లండన్‌కు తిరిగి పయనం అయ్యాడు!. భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు ఈ నెల 20న లీడ్స్‌లో ఆరంభం కానుంది. భారత్‌ఏతో నాలుగు రోజుల టూర్ గేమ్ ముగించుకుని శుభ్‌మన్ గిల్ సేన ఇప్పటికే లీడ్స్‌కు చేరుకుంది. ఉదయం ఇంగ్లాండ్‌కు చేరుకోనున్న గంభీర్.. నేడు లీడ్స్‌లో జట్టుతో చేరనున్నాడు. గంభీర్ గైర్హాజరీలో సహాయక కోచ్‌లు రియాన్, సితాన్షు, మోర్కెల్‌లు జట్టు శిక్షణ బాధ్యతలను పర్యవేక్షించిన సంగతి తెలిసిందే.

# కింగ్ డమ్ చుట్టూ అనుమానపు మేఘాలు



మార్చ్ నుంచి జూలై దాకా వాయిదాలు వేసుకుంటూ వచ్చిన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ కొత్త రిలీజ్ డేట్ ఇప్పటిదాకా ప్రకటించలేదు. హరిహర వీరమల్లు కోసం వెయిట్ చేస్తోందని, దాని అనౌన్స్ మెంట్ వచ్చాక నిర్ణయం తీసుకోవాలని సితార టీమ్ ప్లాన్ చేసినట్టుగా వినిపిస్తోంది. కానీ ఈ ప్రాజెక్టు మీద జరుగుతున్న ప్రచారాలు అనుమానపు మేఘాలను కమ్మేలా చేస్తున్నాయి. ఒకవేళ వీరమల్లు కనక జూలై 18 వచ్చే పక్షంలో కింగ్ డమ్ ని జూలై 25 విడుదల చేయాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందట. కానీ ఆ డెడ్ లైన్ మీట్ కావడం గురించి దర్శకుడు గౌతమ్ తిన్ననూరి నుంచి ఎలాంటి హామీ రాలేదని ఇన్ సైడ్ టాక్. కొంత భాగం రీ షూట్ తో పాటు అనిరుద్ రవిచందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కి ఎక్కువ టైం పట్టేలా ఉందని వినికిడి. ప్రస్తుతం కూలితో బిజీగా ఉన్నందున కొంచెం ఆగమని చెబుతున్నాడట. ఇది నిజమైన పక్షంలో జూలైలో రావడం అనుమానమే. పోనీ ఆగస్ట్ 1 లాక్ చేసుకుందామంటే కేవలం రెండు వారాల వ్యవధిలో వార్ 2, కూలి వస్తాయి కాబట్టి థియేటర్ రన్ దెబ్బ తింటుందనే డౌట్ నిర్మాతల్లో ఉండొచ్చు. ఇంకోవైపు రానా నిర్మాతగా దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా రూపొందిన కాంతని ఆగస్ట్ 1 రిలీజ్ చేయడానికి దాదాపు డిసైడ్ అయ్యారట. అదే జరిగితే కింగ్ డమ్ కు ఇంకో ఆప్షన్ చేజారినట్టే. జూనియర్ ఎన్టీఆర్ తో వాయిస్ ఓవర్ చెప్పించిన తర్వాత కింగ్ డమ్ కు మంచి బజ్ వచ్చింది. విజువల్స్ చూశాక కెజిఎఫ్ రేంజ్ లో ఏదో కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామనే హామీ అందులో దొరికింది. కానీ ఈలోగా వాయిదాలు జరగడం బజ్ ని తగ్గిస్తోంది. ఇప్పటికే దీని మీద చాలా పెద్ద బడ్జెట్ పెట్టేశారు. ఆడియన్స్ లో ఎగ్జైట్ మెంట్ తగ్గకుండా ఏదో ఒక పబ్లిసిటీ జరుగుతూనే ఉండాలి. అసలే కింగ్ డమ్ శ్రీలంక శరణార్థుల బ్యాక్ డ్రాప్ లో రూపొందిన సీరియస్ డ్రామా. మన ప్రేక్షకులను ముందస్తుగానే సిద్ధం చేయాలి. దానికున్న ఒకే ఆయుధం ప్రమోషన్లు. మరి కింగ్ డమ్ బృందం ఏ దిశగా అడుగులు వేస్తుందో చూడాలి.



# ప్యారడైజ్ లక్ష్యానికి అనుకోని బ్రేకులు

న్యాచురల్ స్టార్ నాని కెరీర్ లోనే అతి పెద్ద ప్యాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ది ప్యారడైజ్ ముందు లాక్ చేసుకున్న విడుదల తేదీ మార్చ్ 26. ఒక రోజు గ్యాప్ తో రామ్ చరణ్ పెద్ది వస్తున్నా సరే వెనక్కు తగ్గకూడదని తొలుత నిర్ణయించుకున్నారు. కానీ తాజా పరిణామాలు ప్యారడైజ్ కు బ్రేక్స్ లా మారుతున్నాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ జరిగినప్పటికీ ఇంకొందరు కీలక ఆర్టిస్టుల డేట్లు అందుబాటులో లేకపోవడంతో పాటు సెట్ వర్క్ మరింత మెరుగు పరచాలనే ఉద్దేశంతో చిన్నవిరామం ఇచ్చారని, తిరిగి జూలై లేదా ఆగస్ట్ లో పునఃప్రారంభమవుతుందని అంతర్గత సమాచారం.ఒకవేళ ఇది నిజమైతే ప్యారడైజ్ మార్చ్ లో రావడం కష్టం. వేసవికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వేగంగా తీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పరిస్థితులు దానికి సహకరించడం లేదని వినికిడి. నాని కూడా ఎలాంటి కమిట్ మెంట్స్ లేకుండా పూర్తిగా దీనికే అంకితమవుతున్నాడు. బయట ప్రచారం జరుగుతున్నట్టు ఇంకా ఓటిటి డీల్ కాలేదని తెలిసింది. నెట్ ఫ్లిక్స్ రెడీగా ఉన్నా రేట్ విషయంలో కంక్లూజన్ కు రాలేదని అంటున్నారు. చాలా ముఖ్యమైన పాత్రకు మోహన్ బాబుని తీసుకున్నారనే వార్త కూడా అధికారిక ధృవీకరణ దక్కించుకోలేదు. నెలల తరబడి ఇది గాసిప్ గానే ఫిలిం నగర్ వర్గాల్లో తిరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే భారీ పొటెన్షియల్ ఉన్న పెద్ది, ది ప్యారడైజ్ లు క్లాష్ లేకుండా సోలోగా రావడమే మంచిది. ఒకపక్క పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు పరుగులు పెట్టిస్తున్నారు. ఇంకా చాలా టైం ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లకు ఎక్కువ సమయం దొరికేలా చూసుకుంటున్నారు. హైప్ పరంగా చూస్తే దీని మీద విపరీతమైన బజ్ వచ్చేసింది.

# మాట తప్పని తమ్ముడు




ఇటీవలే విడుదలైన నితిన్ తమ్ముడు ట్రైలర్ ఈవెంట్ లో దిల్ రాజు మాట్లాడుతూ ఇకపై యూట్యూబ్ వ్యూస్ కొనమని, జెన్యూన్ గా ఎంత మంది చూస్తారో దాన్నే ప్రామాణికంగా తీసుకుంటామని స్టేజి మీద ప్రకటించారు. దానికి తగ్గట్టే తమ్ముడు ఎలాంటి ఫేక్ ప్రాపగండాకు పోలేదని అర్థమవుతోంది. ప్రొడ్యూసర్ అఫీషియల్ ఛానల్ లో నాలుగు రోజులకు గాను తమ్ముడు నమోదు చేసిన వ్యూస్ 2.9 మిలియన్లు. టి సిరీస్ ఛానల్ లో మరో 2 లక్షల వ్యూస్ ఉన్నాయి. ఇందులో ఉన్న సాలిడ్ కంటెంట్ ప్రకారం చూసుకుంటే ఇవి చిన్న నెంబర్లు. కానీ ఎలాంటి కృత్రిమ వీక్షణల జోలికి వెళ్ళకపోవడం వల్ల అంకెలు నిజాయతీగా ఉన్నాయి.కొంచెం వెనక్కు వెళ్తే ఇదే నితిన్ నటించిన ఫ్లాప్ సినిమాల ట్రైలర్ వ్యూస్ చూస్తే నిజమేంటో అర్థమవుతుంది. ఉదాహరణకు ఇతర డిజాస్టర్ల వ్యూస్ చూస్తే ఏవీ 10 మిలియన్లకు తక్కువ లేవు. రిలీజ్ కు ముందు కూడా వీటి మీద పెద్ద బజ్ లేదు. అలాంటప్పుడు అంత పెద్ద అంకెలు కనిపించడం విచిత్రం. నిజానికి ఇది అందరూ నిర్మాతలు, హీరోలు ఫాలో అవుతున్న ప్రాక్టీసే. బయటికి ఎవరూ చెప్పుకోరు కానీ ఫ్యాన్స్ ని సంతృప్తి పరచడం కోసమో లేదా బిజినెస్ ని హైప్ చేసుకోవడం కోసమో బోలెడు డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఓటిటిలు సైతం ఈ వ్యూస్ ని చూసి ప్రీ రిలీజ్ బజ్ అంచనా వేసిన ఉదంతాలు లేకపోలేదు. దిల్ రాజు తీసుకున్న నిర్ణయం వల్ల తమ్ముడుకి అసలైన మద్దతు ఎంత ఉందనేది స్పష్టత వచ్చింది. సినిమా బాగుంటే ఆటోమేటిక్ గా ఇవి పెరుగుతాయి. జూలై 4 అది తేలిపోతుంది. కానీ ఇతర ప్రొడ్యూసర్లు కూడా ఈ దిశగా ఆలోచన చేస్తే మంచిదే.

# మూడు గంటలు సేఫ్ గేమే



ది రాజా సాబ్ టీజర్ అభిమానులకు బ్రహ్మాండంగా నచ్చేసింది. సోషల్ మీడియాలో అధిక శాతం పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తుండగా విఎఫ్ఎక్స్ మీద కామెంట్స్ చేస్తున్న వాళ్ళు లేకపోలేదు. ఎవరి సంగతి ఎలా ఉన్నా దర్శకుడు మారుతీ నుంచి ఆశించిన దానికన్నా బెటర్ అవుట్ పుట్ కనిపించడం పట్ల ఫ్యాన్స్ హ్యాపీగా ఉన్నారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు అనౌన్స్ చేసినప్పుడు కొంత నెగటివిటీ వచ్చింది. హిట్టు దర్శకులు వెంటపడుతుంటే ఫ్లాప్ డైరెక్టర్ కు అవకాశం ఇవ్వడం గురించి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎస్కెఎన్ అన్నట్టు ఇవన్నీ దాదాపు తీరినట్టేనని చెప్పొచ్చు. రిలీజ్ ఇంకా దూరం ఉంది కాబట్టి చాలా ఎక్స్పెక్ట్ చేయొచ్చు.ఇదిలా ఉండగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నల్లో భాగంగా దర్శకుడు మారుతీ మాట్లాడుతూ ది రాజా సాబ్ మూడున్నర గంటలు ఉంటుందని చెప్పడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. హాలీవుడ్ కు ఈ సినిమా తీసుకెళ్లాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ ఇంత నిడివి అక్కడ ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూసుకోవాలనే రీతిలో సంకేతం ఇచ్చాడు. డిస్నీ లాంటి మూవీస్ మనమూ తీయగలమని రాజా సాబ్ నిరూపిస్తుందని అన్నారు. తర్వాత మళ్ళీ క్లారిటీ ఇస్తూ అదేదో ఫ్లోలో అన్నానని రాజా సాబ్ మూడు గంటలే ఉంటుందని క్లారిటీ ఇచ్చాడు. సో ఓవర్ లెన్త్ ఆందోళన లేనట్టే. అయినా కంటెంట్ బాగుంటే ఎంతసేపు థియేటర్ లో కూర్చున్నామనేది ప్రేక్షకులు లెక్కచేయలేరని పుష్ప 2 నిరూపించింది. కాకపోతే రాజా సాబ్ హారర్ కామెడీ డ్రామా. యాక్షన్ ఎలిమెంట్స్, పాటలు, ఇతర అంశాలు ఎన్ని ఉన్నా దెయ్యాల బ్యాక్ డ్రాప్ లో మరీ ఎక్కువ కంటెంట్ ఉంటే అనుమానాలు రావడం సహజం.

# 'కృష్ణ' విలన్ ఎలా చనిపోయాడంటే..?



ముకుల్ దేవ్.. అటు హిందీలో, ఇటు తెలుగులో బాగా పాపులర్ అయిన విలన్. తెలుగులో పదుల సంఖ్యలో సినిమాలు చేసిన రాహుల్ దేవ్ తమ్ముడే ఈ ముకుల్ దేవ్. అన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ నటుడిగా మంచి గుర్తింపే సంపాదించాడు. తెలుగులో 'కృష్ణ'తో పాటు అదుర్స్, సిద్ధం, నిప్పు, భాయ్ లాంటి చిత్రాల్లో నటించిన ముకుల్.. తర్వాత కనిపించకుండా పోయాడు. ఇటీవలే అతడి మరణవార్త విని అందరూ షాకయ్యారు. ముకుల్ అనారోగ్యంతో చనిపోయాడన్నారు కానీ.. అతడికి ఏమైందన్నది వెల్లడి కాలేదు. ఐతే తన తమ్ముడి మరణం గురించి బాలీవుడ్లో రకరకాల ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో రాహుల్ దేవ్ ఒక ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చాడు. తల్లిదండ్రుల మరణం, భార్యతో విడాకుల నేపథ్యంలో అతను మానసికంగా దెబ్బ తిన్నాడని.. దీంతో పాటు ఆహార అలవాట్లు మారిపోయాయని.. ఫలితంగానే అతను ప్రాణాలు విడిచాడని అతను స్పష్టతనిచ్చాడు. ముకుల్ మరణం గురించి ఊహాగానాలు కట్టిపెట్టాలని అతను కోరాడు. "ముకుల్ చనిపోవడం గురించి రకరకాలుగా మాట్లాడుతున్నారు. అవేవీ నిజం కాదు. అతను ఫిట్‌గా లేడని అంటున్నారు. కానీ హాఫ్ మారథాన్‌లో పరుగెత్తే స్థాయి ఫిట్‌నెస్ అతడిది. తల్లిదండ్రుల మరణం తర్వాత అతణ్ని ఒంటరితనం వేధించింది. భార్య నుంచి విడిపోయాడు. అవి అతణ్ని కుంగదీశాయి. ముకుల్‌ను దగ్గరుండి పట్టించుకునేవారు కరువయ్యారు. ఎక్కువ సమయం ఒంటరిగా ఉండేదుకే ఇష్టపడేవాడు. తనకు సినిమా అవకాశాలు వచ్చినా అతను ఒప్పుకోలేదు. సరిగా తినేవాడు కాదు. ముకుల్ వారం రోజుల పాటు ఐసీయూలో ఉన్నాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in